• శ్రమజీవులను విస్మరించిన బడ్జెట్ • అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కార్మికలోకం

మార్చి 2005 మాస పత్రిక వెల రూ: 5



ఇన్సూరెన్స్ ఉద్యోగుల మహాసభలు



పేటెంట్ దిష్టిబొమ్మ దగ్ధం

పేటెంట్ పద్మవ్యూహం!

Think FINANCE Think APSFC

APSFC, a development Financial Institution for SMEs, offers Term Loans and Short Term Loans upto Rs.500 lakhs for Private / Public Limited Companies / Co-operative Societies and upto Rs.1000 lakhs to deserving Good Entrepreneurs. The Tiny, Small, Medium Scale units with project cost not exceeding Rs.12 crores and the Service Sector units with a maximum project cost of Rs.20 crores are eligible for financial assistance.

The Corporation is :

- Operating through 25 Computerized, networked branches spread across Andhra Pradesh.
- Market leader with a share of around 45% in term lending to SSIs in the state of Andhra Pradesh with a sharp focus on First Generation Enterpreneurs.
- Funded over 84,078 units with an amount of about Rs.5,048 Crores during last 48 years.
- Ranking No.1 in key Result Areas of Sanctions, Disbursements and in percentage of Recoveries among SFCs in the country.
- Operating more than 36 different schemes to suit various market segments and also offers special schemes for Good Enterpreneurs.
- Operating tailor made schemes for setting up Hotels, Hospitals, Tourism related activities, Commercial Complexes, Super Bazars, Food Processing, Export Oriented Industries etc.
- Accepts Fixed Deposits at attractive interest rates from Individuals, Firms, Companies, Societies and Government Departments / Government Corporations.
- Also involved in Non-Fund based activities including distribution of Insurance Products, Sale of Government of India Relief Bonds, dealing in Government Securities, Advisory Services, Valuations etc.

In APSFC the customer is most important. The Corporation ensures customer satisfaction through professional management and teamwork. Come, meet the financier who has truned many a dream into reality.

Andhra Pradesh State Financial Corporation

5-9-194, Chirag Ali Lane, P.B.No.165 HYDERABAD - 500 001
Ph; 040-23201398, 23201646, 23202547, 23202550-53
Grams : AFINCORP. Fax: (040)-23202972
e-mail : hyd_apsfcho@sancharnet.in Website: www.apsfc.com

ISO 9001-2000 CERTIFIED CORPORATION

Powering Growth Empowering Enterprise

మార్చి - 2005

కార్మికలోకం

సి.ఐ.టి.యు. ఆంధ్రప్రదేశ్ కమిటీ మాసపత్రిక

సంపుటి 20 సంచిక 3

విడి ప్రతి వెల : రూ. 5

సం॥ర చందా : రూ. 50

విషయ సూచిక

సంపాదకీయం ------------------- 1
కవర్‌స్టోరీ- పేటెంట్ పద్మవ్యూహం- 3-5
థైరాయిడ్ బెంగ ------------------- 6
బాలాజీ హేచరీస్ పోరాటం --------- 7
ఉద్యమవార్తలు --------------- 8-12
సామాజిక న్యాయం ------------- 14
అంతర్జాతీయ మహిళా దినోత్సవం --- 15
పోస్టల్ ఉద్యోగుల సమ్మెపిలుపు -------- 16
సమకాలిన పరిస్థితులు కార్మిక.... ------ 17
కథ- అనుమానప్పురుగు ----- 20-21
సలహాబోర్డులు న్యాయం చేస్తాయా?-22-23
ఎఫ్‌డిఐలు,ప్రైవేటీకరణ బండారం - 27
కేంద్ర బడ్జెట్ ---------------------- 28
శ్రమజీవులను విస్మరించిన ------- 29
నష్టార్తిదాయకం ఈ గూడ్స్‌షెడ్ యూనియన్ ----------------- 31
భీమా ఉద్యోగుల మహాసభ ------- 32

మేనేజర్
కార్మికలోకం
యన్.వి.బి. స్మారక కేంద్రం, 1-1-60/4,
ఆర్టీసి క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్ - 20.
ఫోన్ : 27612474 ఫ్యాక్స్ : 27610128

సంపాదక వర్గం
పర్సా సత్యనారాయణ
ఎం.ఎ. గఫూర్, ఎస్. వీరయ్య
ఆర్. సుధాభాస్కర్, రోజా
జ్యోతి, టి.యస్.వి. రమణ
ఎడిటర్ : వై. సిద్ధయ్య
మేనేజర్ : పి.రాజారావు

సంపాదకీయం

చాణిక్యనీతి - బడ్జెట్‌రీతి

చాణిక్యుడు రాజతంత్రంలో మాయావి. ప్రత్యర్ధులను మోసంచేయటంలో దిట్ట. మన కేంద్రఆర్ధికమంత్రి 2005-06 బడ్జెట్ రూపకల్పనలోనూ, దానిని పార్లమెంటులో ప్రవేశపెట్టిన తీరు పాలకుల చాణిక్యనీతికి నిదర్శనం. ఒకవైపు దేశంలో సంస్కరణల కొనసాగింపుకు వీలుగా కేటాయింపులు చేశారు. వేరొక వైపున తమ రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించే ప్రజలు, వామపక్షాల వత్తిడిపై కొన్ని రంగాలకు అరకొర కేటాయింపులు చేశారు. 'అందరికీ అన్నీ చేశాం' అంటూ ప్రచారం చేసుకోవటం పాలకుల అపరచాణిక్యనీతికి నిదర్శనం కాదా?

రూ.5,14,300 కోట్ల బడ్జెట్ అంచనాలో రూ.1,51,144కోట్లు ద్రవ్యలోటు ఉంది. ఈ లోటు పూడ్చే మార్గం ఏమిటి? వర్ధమాన దేశాలతో పోలిస్తే సంపన్నులపై ప్రత్యక్ష పన్నులు మనదేశంలో చాలా తక్కువ. ఇక్కడ దేశ స్థూలాదాయం- పన్నుల నిష్పత్తి 1989-90లో10.62 కాగా,1998-99లో 8.26 తగ్గింది. యూరప్‌లో 30-40 మధ్య, స్వీడన్‌లో 50గా ఈనిష్పత్తి ఉంది. ఈ బడ్జెట్‌లో సంపన్నవర్గాలు చెల్లించే పన్నులు 3% పైగా తగ్గించటం స్టాక్ మార్కెట్ సంపన్నులపై పన్ను 0.15 నుండి 0.20కు మాత్రమే పెంచడం అభ్యంతరకరం.

గ్రామీణ భారతానికి వరాలమాల వేశారనటంలో వాస్తవమెంత? ఈసారి వ్యవసాయరంగానికి కేటాయింపుల్లో రూ.1284 కోట్లు, గ్రామీణ ఉపాధి కల్పనకు రూ.5,000లకోట్లు మాత్రమే పెంచారు. అదీ వామపక్షాల వత్తిడిపైనే జరిగాయి. ఈ కేటాయింపులు గతంకంటే మెరుగే. కానీ కరువుకాటకాలవల్ల అల్లాడుతూ, సంస్కరణల దెబ్బలకు బలైన గ్రామీణావసరాలకు పై కేటాయింపులు కంటితుడుపు చర్యలే.

కిరోసిన్, వంటగ్యాస్‌లపై ఎక్సైయిజ్ డ్యూటీ మినహాయించడం మంచిదే. కానీ ఈ చర్య నష్టాలలో వున్న ఆయిల్ కంపెనీలను ఆదుకునేందుకేనట! రిటైల్ ధరలపై దాని ప్రభావం ఉండదట! పెట్రోలు, డీజిల్‌పై లీటరుకు 50పైసలు రోడ్డుసెస్ విధించటం కుడిచేత్తో ఇచ్చి ఎడమ చేత్తో పుచ్చుకోవడమే. బ్యాంకుల నుండి రు.10వేలు ఆపైన డ్రా చేస్తే 0.1% పన్ను విధించటంద్వారా మధ్యతరగతిపై అదనపుభారం వేయడమే.

టీ పోడి, అగ్గిపెట్టెలు వగైరాలపై పన్నులు తగ్గటం సాధారణ ప్రజలకు కొంత ఊరట కల్గిస్తుంది. కానీ బియ్యం, పప్పులు, చింతపండు వగైరా నిత్యావసర సరుకులపై పన్నులు తగ్గించడంపై పాలకులకు శ్రద్ధ లేకపోవటం దురదృష్టకరం.

ఫ్రిజ్‌లు, కార్లు, ఎ.సి వగైరా విలాసవస్తువుల పై పన్ను తగ్గించి సంపన్నులను, చక్కెర, సిమెంట్, ఔషధాలు, ఇన్ఫర్మేషన్‌టెక్నాలజీ రంగాలకు వేలాదికోట్లు కేటాయించి పారిశ్రామిక వేత్తలను సంతోషపరిచారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణపై చిదంబరం గారు నోరుమెదపలేదు. అంటే ప్రభుత్వం ఆ ప్రయత్నం మానుకున్నదా? కాదు. ప్రభుత్వ రంగ సంస్థల షేర్లు అమ్మగా వచ్చిన మొత్తాల నిర్వహణకు 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ నిధి' పేర కొత్త సంస్థను ఏర్పాటు చేస్తారట! బ్యాంకుసెక్టార్‌లో ప్రైవేటీకరణపై ఆర్థికమంత్రి నేరుగా చెప్పలేదు. కాని బ్యాంకింగ్ రెగ్యులేటరీ చట్టాన్ని సవరిస్తామని బడ్జెట్ ప్రతిపాదనలోనే ప్రమాద సంకేతాలు అందించారు.

పెన్షన్‌నిధి నిర్వహణను విదేశీపెట్టుబడి దారులకు అప్పగిస్తామన్న ప్రతిపాదన నష్టదాయకం. వారు తప్పులు చేస్తే, వారి దేశాల కోర్టులకెక్కి న్యాయంపొందటం మనకి సాధ్యంకాదు. భోపాల్‌లోని యూనియన్ కార్బయిడ్ బాధితులు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం.

కాంట్రిబ్యూటరీపెన్షన్ పథకాన్ని అసంఘటిత రంగం కార్మికులకు వర్తిస్తామని ప్రతిపాదించటం ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోనేందుకు వేసిన ఎత్తుగడ.

స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు, సంపన్నులు బడ్జెట్‌లో తమకు లభించిన రాయితీలను, కేటాయింపులకు మించే ప్రభుత్వం నుండి లాక్కోగల శక్తివుంది.

సాధారణ ప్రజలకు బడ్జెట్‌లో ఇచ్చిన అరకొరకేటాయింపులను పాలకులు స్వచ్ఛందంగా అమలు పరచరు. ప్రతి రాయితీని, పథకాన్ని పోరాడి అమలు పరచుకోవలసిందే. బడ్జెట్‌పై పార్లమెంటులో జరిగే చర్చలను కార్మికవర్గ పోరాటాలు ప్రభావితం చేయాలి. బడ్జెట్ లోపాలు సరిచేయాలి.

...

కార్టూనీయం

వివిధ పత్రికల సౌజన్యంతో





పేటెంట్ పద్మవ్యూహం



మహాభారతంలో కురుక్షేత్ర సంగ్రామం గుర్తుంది కదా. పద్మవ్యూహం అందులో సంక్లిష్ట యుద్ధతంత్రం! పాపం అభిమన్యుడు అమాయకంగా శతృవుల దుష్టవ్యూహంలో చొరబడి కౌరవులకు చిక్కి బలైపోయాడు. ఇది కాల్పనికం.

కానీ మన పాలకులు (కాంగీ, బి.జె.పి., టి.డి.పి.. పార్టీలవారు) మహామేధావులు. వంచనాశిల్పంలో ఆరితేరిన వారు. తమ స్వార్ధంకోసం సామ్రాజ్యవాదుల పేటెంట్ పద్మవ్యూహంలో దేశాన్ని ఇరికించారు. విశిష్టమైన భారత్ పేటెంట్ చట్టం- 1970కి విద్రోహకరమైన మార్పులు చేశారు. విదేశీ పెట్టుబడిదారులతో కుమ్మక్కయి మన ప్రజలకు ద్రోహం తలపెట్టారు. అదే దేశఅభివృద్ధికి ఏకైకమార్గమన్న ప్రచారంలో ప్రజలను వంచిస్తున్నారు.

డబ్ల్యు.టి.వో. సునామీ :2004 డిశెంబర్ 26 దుర్ధినం. సునామీ - లక్ష మందికిపైగా కబళించిన భయంకర జలప్రళయం జరిగిన రోజు. అదే రోజు మన వ్యవసాయం, మందులు, సాఫ్ట్‌వేర్ రంగాలను కబళించే డబ్ల్యుటిఓ సునామీకి పాలకులు తెరలేపారు. భారత పేటెంట్‌చట్టం-1970కి కేంద్రప్రభుత్వం నష్టదాయకమైన సవరణలతో ఆర్డినెన్స్ చేసింది. బహుళజాతి సంస్థల వత్తిడికి లొంగి దేశప్రయోజనాలను ఫణంగాపెట్టింది.

పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళ, తమిళనాడు, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు పై ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రధానికి లేఖలు వ్రాశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలోని 'వ్యవసాయరంగం'పై తమహక్కులను ధారాదత్తం చేసే అధికారం కేంద్రానికి లేదన్న అభ్యంతరాలకు కేంద్ర ప్రభుత్వం విలువ ఇవ్వకపోవటం అప్రజాస్వామికం.

ట్రిప్స్ ఒప్పందంలో పలు అంశాలను వ్యతిరేకించేందుకు తప్పించుకునే క్లాజు (ఎస్కేప్‌క్లాజు) వున్నది. మొక్కలు, జంతువులు, పక్షులు వగైరా జీవజాల సంబంధ అంశాలను నైతిక, సాంప్రదాయక విలువల సాకుతో పేటెంట్ పరిధి నుండి తప్పించవచ్చు. ఆ ప్రయత్నంకూడా పాలకులు చేయకపోవటం పూర్తి బాధ్యతారాహిత్యం.

విశిష్టమైన భారత పేటెంట్ చట్టం - 1970 : 1911లోమనకు బ్రిటీష్ పేటెంట్ చట్టం వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చాక 'అయ్యంగార్' కమిటి 11సం॥ల అధ్యయనం తర్వాత భారతపేటెంట్‌చట్టం 1970 రూపొందింది. సాధారణ ప్రజలకు మేలు చేసేదిగా అది ప్రసిద్ధిచెందింది. ఇది మన వ్యవసాయం, పరిశ్రమలు, ఔషధాలు, రసాయనాలు వగైరాలను విదేశీ కంపెనీలదాడుల నుండి కాపాడింది. నూతన ఆర్థిక విధానాల రాకతో మనపేటెంట్‌చట్టంపై దాడి మొదలయింది. అమెరికాలో వున్న పేటెంట్ చట్టాన్నే మనపై రుద్దేందుకు ఈ ఆర్డినెన్స్ తెచ్చారు.

ఆర్డినెన్స్ ప్రమాదకరం: చాలా కాలంగా దేశంలో అమలులో ఉన్న తయారు పద్ధతి (ప్రాసెస్) పేటెంట్ స్థానే ఉత్పత్తి (ప్రొడక్ట్) పేటెంట్‌కు మారుస్తున్నారు. ప్రపంచంలో ఏ కొత్త వుత్పత్తి జరిగినా మనం దాని తయారీ పద్ధతి మార్చి, మన ప్రయోగశాలల్లో మనకు అవసరమైన ఔషధాలు మనమే తయారు చేసుకునేవారం. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను, కంప్యూటర్‌లు, సి.డి.లు వగైరాలను మనమే చేసుకునే స్వేచ్ఛ మనకు వుండేది. ఆర్డినెన్స్‌ను పార్లమెంట్ చట్టంగా ఆమోదిస్తే పై అవకాశాలను మనం కోల్పోతాం. ప్రతి అవసరానికి విదేశీ ఉత్పత్తులపై ఆధారపడాల్సి వస్తుంది. అమెరికా, ఇంగ్లండ్ కంపెనీలతో వచ్చే వివాదాలను మనం ఆయా దేశాల కోర్టులలోనే వ్యాజ్యాలు

వేయాలట. తద్వారా ప్రజలను చట్టబద్ధపోరాటాలకు దూరంగా ఉంచడమే. పసుపు పై పేటెంట్ పొందిన అమెరికన్ సంస్థపై అక్కడి కోర్టులలో కేసు నడిపినందుకు మన ప్రభుత్వ సంస్థ సి.ఐ.యస్.ఆర్.కు రు.45 లక్షలు ఖర్చుయింది. ఇది సాధారణ ప్రజలకు సాధ్యమా? పాత చట్టంలో ఏదో కొత్త ఆవిష్కరణకు పేటెంట్ జారీ చేసేముందే అభ్యంతరాలు సేకరించేవారు. కొత్త ఆర్డినెన్స్ ఈ వసతిని తొలగించింది. పేటెంట్ హక్కులు ఇవ్వడం పూర్తయ్యాకే మనకు తెలుస్తుంది. పసుపు, వేప, బసుమతిబియ్యాలకు అమెరికన్‌లకు పేటెంట్ మంజూరయ్యాకే మనకు తెలిసింది.

డబ్ల్యు.టి.ఓ. పడగనీడకు : విదేశీ బహుళజాతి సంస్థలకు భారత్ వంటి వెనుకబడిన దేశాలను పాదాక్రాంతం చేసేదే, ప్రపంచరాజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ). మన దేశం ఆ సంస్థలో 1994లో చేరింది. నాటి పాలకులు పార్లమెంట్ అభ్యంతరాలను ఖాతరు చేయలేదు. ఈ సంస్థ గతంలో వాణిజ్యం సుంకాలకే పరిమితం. వ్యవసాయం, ఔషధాలు, జీవజాలం, శాస్త్రసాంకేతికపరిజ్ఞానం వగైరా అన్నింటిపైనా డబ్ల్యు.టి.ఓ. తన పడగనీడకు తెచ్చుకుంటున్నది. ఇందుకు మేధోసంపత్తి హక్కులు (టిప్స్) టిమ్స్, గాట్‌లను సాధనాలుగా సంధించారు. డబ్ల్యు.టి.ఓ. సభ్యదేశాలకు వీటిని ఆమోదించాలని హుకుం జారీ చేశారు. 2005 జనవరి 1 నుండి ఆయాదేశాలలో అమలు పరచాలని లక్షణరేఖను గీశారు. ఇవన్నీ అమెరికా ప్రపంచాన్ని తమ చెప్పుచేతల్లో వుంచుకునేందుకు అవసరం.

రేడియోను మార్కోనీ, విమానాన్ని రైట్‌సోదరులు, కరెంట్ బల్బ్‌ను ఆల్వెఎడిసన్ కనుగొన్నారు. సర్‌ఐజాక్ న్యూటన్ భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని, డార్విన్ పరిణామవాదాన్ని, ఆవిష్కరించారు. ఇలా కొత్త ఆవిష్కరణలు చేసిన వారి సేవలకు గుర్తింపుగా నాటి పాలకులు పేటెంట్లుతో గౌరవించేవారు. అవే పేటెంట్ హక్కులు. 1474లో వెనిస్ పాలకులు మొదటి పేటెంట్ చట్టం తెచ్చారు. ప్రస్తుతం ఈ పేటెంట్ చట్టాలను బహుళజాతి కంపెనీలు తమ దోపిడీ సాధానాలుగా వాడుకుంటున్నాయి.

మేథో సంపత్తి హక్కులు అంటే?: ఇంటిపైన, భూమిపైన, సొంత ఆస్తిపైన హక్కులు మనకు తెలుసు. కానీ మేథోసంపత్తిపై కూడా హక్కులుండాలని డబ్ల్యు.టి.ఓ. వాదిస్తున్నది. ఒక మానవుడి మేధస్సు తన జీవితకాలంలో తన చుట్టూ వున్న సమాజంపై ఆధారపడి ఉంటుంది. దశాంక భిన్నాలను లేదా జీరో (సున్నా)ను ఉపయోగించకుండా ఏ సంపన్న దేశమైనా గణితశాస్త్ర పరిశోధనలను కానీ, దాని ఆధారంగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను కాని అభివృద్ధి చెయ్యలేదు. మన ప్రాచీనులు జీరోను పేటెంట్ చెయ్యలేదు. ఇలా అనేక ఉదాహరణలు చెప్పుకోవచ్చు.

శాస్త్రవేత్త ప్లెమింగ్ పెన్సిలిన్ మందు కనిపెట్టారు. లక్షలాదిమందిని వ్యాధుల బారినుండి కాపాడారు. ఆయన

జాతీయ ఔషధరంగం దివాలా

1970 పేటెంట్ చట్టం ప్రకారం ఎవరైనా ఏదైనా వస్తువును (ప్రాడక్టు) కనిపెడితే ఆ వస్తువును తయారు చేసిన పద్ధతి(ప్రాసెస్)పై 5 నుండి 7సం॥లకు మాత్రమే పేటెంట్ హక్కులుండేవి. అదే వస్తువును అదేపద్ధతిలో ఎవరైనా తయారుచెయ్యవచ్చు.

1970 పేటెంట్‌చట్టానికి ముందు మన దేశ మందుల పరిశ్రమలో 80శాతంవాటా బహుళజాతిసంస్థల చేతుల్లో ఉండేది, చట్టం వచ్చాక 70% వాటా మన దేశీయ కంపెనీల చేతుల్లోకి వచ్చింది.

ఈ సౌలభ్యంవల్ల మన ఔషధాలపరిశ్రమ బాగాఅభివృద్ధి చెందింది. మందులవ్యాపారం రు.10కోట్లనుండి రు.28,000 కోట్లకు పెరిగింది. పలుదేశాలతో పోలిస్తే మందులధరలు మనదేశంలో తక్కువ. ప్రపంచంలో దాదాపు 500రకాల బల్క్‌డ్రగ్స్ ఉండగా, 300 రకాల మందులను మనదేశంలో చౌకగా తయారుచెయ్యగల్గుతున్నాం. 100 మందుల తయారీల కొత్తవిధానాన్ని కనిపెట్టాం.

ఎయిడ్స్‌మందును విదేశీకంపెనీలు ఏడాది కోర్సు రు.4.5-5లక్షలకు అమ్ముతుంటే, అదేమందు మనదేశంలో తయారయి రూ.6,300లకే దొరుకుతున్నది. ఈ మందును 22 దేశాలకు ఈ ధరకు మనం ఎగుమతిచేస్తున్నాం. అలాగే "గ్లివాక్" అనే రక్తకేన్సర్ మందు మనదేశీయకంపెనీలు కోర్సుకు రు.8 వేలకు అమ్ముతుంటే, బహుళజాతిసంస్థ "నోవార్టిస్" రు. 50,000/-లకు అమ్ముతున్నది.

మనదేశంలో ఈచట్టం రాకముందు టైఫాయిడ్‌కు వాడే "క్లోరోమైసిటిన్" అనేమందును పార్క్‌డేవిస్ (అమెరికా బహుళజాతి సంస్థ) ఒక గొట్టాన్ని రు.11/-కు 40సం॥ల క్రితం అమ్మేది. అదే మందును భారత ప్రభుత్వరంగ సంస్థలు ఐ.డి.పి.యల్., హెచ్.ఏ.ఎల్.లు 70పైసలకే తయారు చేసి అమ్మాయి. ఫైజర్ అనే అమెరికా బహుళజాతి సంస్థ "టెట్రాసైక్లిన్" అనే ఇన్ఫెక్షన్‌కు వాడే మందును రు.21లకు (30సం॥ల క్రితం) అమ్మింది. అదే మందులు ఐ.డి.పి.ఎల్. 40పైసలకే తయారు చేసి అమ్మింది. ఇలాగే ఎన్నోరకాల మందులు తక్కువ ధరలకు మనకు అందాయి.

ఈ ప్రయోజనాలన్నీ 1970 పేటెంట్‌చట్టంవల్లే సాధ్యమయ్యాయి. మందులరంగంలో భారతదేశం స్వావలంబనను సాధించింది. ఈ రంగంలో లక్షలాది మందికి ఉపాధి లభించింది.

ఆర్డినెన్స్ వల్ల మందులరంగంలో బహుళజాతి గుత్తాధిపత్యం పెరిగి మందులధరలు విపరీతంగా పెరుగుతాయి. ప్రజల ప్రాణాలు పేటెంట్ హక్కులు పొందిన వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్తాయి. మందులరంగంలో మనం సాధించిన స్వావలంబనను కోల్పోతాం. దేశీయ మందుల కంపెనీలు, బల్క్‌డ్రగ్స్ కంపెనీలు మూతబడి లక్షలాది మంది ఉపాధి కోల్పోతారు.

పేటెంట్ కోరలేదు. నాటికి అందుబాటులో వున్న పలుశాస్త్రాల ఆధారంగా పైఆవిష్కరణ చేశారు.

ఇవన్నీ సాంప్రదాయకంగా అభివృద్ధి అయిన మేధోసంపత్తి ఆవిష్కరణలే. వీటి పునాదిపైనే కొత్త ఉత్పత్తులు కనుగొంటున్నారు. ఆవిధంగా సాంప్రదాయక మేధోసంపత్తి ఉత్పత్తులు మానవకళ్యాణానికి ఉపయోగపడాలి.

కానీ పేటెంట్‌హక్కులపేర విదేశీబహుళజాతికంపెనీలు సాంప్రదాయకసంపదను దోపిడీచేస్తామంటే మనం అంగీకరించాలా? తప్పదంటున్నారు మనపాలకులు. తేల్చుకోవలసింది ప్రజలే.

పాలకుల బాధ్యతా రాహిత్యం : స్వదేశీజపంతో కేంద్రంలో గద్దెనెక్కిన వాజ్‌పేయిసర్కారు విదేశీకంపెనీలముందు సాగిలపడింది. వారికి అనుకూలంగా పేటెంట్ చట్టంలో 2004 మార్చిలో పలుసవరణలతో ఆర్డినెన్స్ తెచ్చింది. ప్రజలలో అపఖ్యాతిపాలయి ఇంటిదారి పట్టింది.

ఎన్నికల అనంతరం యు.పి.ఎ. అధికారం చేపట్టింది బి.జె.పి. పెట్టిన రాక్షసగుడ్డును పొదిగింది. తాటకిలాంటి భయంకరరాకాసికి జన్మనిచ్చింది. అదే 26.2.05 పుట్టుకొచ్చిన కొత్త పేటెంట్‌ఆర్డినెన్స్. యు.పి.ఎ. ప్రభుత్వం జాతీయకనీసఉమ్మడి కార్యక్రమాన్ని ఉల్లంఘిస్తున్నది. దేశ సార్వభౌమత్వం, ప్రజలఆరోగ్యాలను రక్షిస్తానన్న వాగ్దానాన్ని తుంగలోతొక్కింది. విదేశీబహుళజాతిసంస్థలు, ఇక్కడ వారిఏజంట్లకోసం దేశాన్ని మరోసారి ప్రపంచీకరణ రొంపిలోకిదింపుతున్నది.

వ్యవసాయరంగంలో పెను ప్రమాదం: కొత్త విత్తన చట్టం 2004ను ప్రతిపాదించారు. విత్తనాలు, పురుగుమందులు, మొక్కలు, జంతువులు వగైరాలలో వ్యవసాయ పరిశోధన కొత్త పేటెంట్‌చట్టం వల్ల దెబ్బతింటుంది. విత్తనాల, పురుగు మందుల ధరలు నియంత్రించే అధికారం విదేశీ కంపెనీల చేతికి పోతుంది. పంటలు- ఉత్పత్తి, ధరల నియంత్రణ వారే నిర్ణయిస్తారు. మన వ్యవసాయ ఉత్పత్తులను బహుళజాతి సంస్థలు కారు చౌకగా తరలించుకు పోయి లాభాలార్జిస్తున్నాయి. ఇండియా నుండి ఎగుమతి అయ్యే మంచి టీ పొడి అమెరికాలో 2 డాలర్లు (సుమారు రు.100)లోపే పలుకుతున్నది. న్యూయార్క్‌నగరంలో ఒకకప్పుటీ ఖరీదు 2 డాలర్లు, అంతకంటే ఎక్కువగా ఉంది. అంటే మన ఉత్పత్తులు ఎంతకారుచౌకగా విదేశీయులు కొట్టేస్తున్నారో స్పష్టం.

మనది గుడ్డి వ్యతిరేకత కాదు: శాస్త్రసాంకేతికపరిజ్ఞానం వేగంగా అభివృద్ధిచెందుతున్నకాలమిది. ఆ విజ్ఞానం మన అభివృద్ధికి అవసరం. మన కార్మికవర్గ శ్రమభారం తగ్గింపుకు ఆ విజ్ఞానం తోడుకావాలి. విజ్ఞానం ప్రపంచమానవాళి ఉమ్మడి సొత్తు. దేశాల మధ్య ఇచ్చిపుచ్చుకోవటమే నిజమైన ప్రపంచీకరణ. వెనుజులా తన వద్ద అదనంగా వున్న పెట్రోలు, ఆయిల్ క్యూబాకు ఇస్తున్నది. వెనిజులా గ్రామీణ వైద్య సేవలకు క్యూబా వేలాది తనడాక్టర్లను పంపుతున్నది. తృతీయ ప్రపంచదేశాలకు సోవియట్ కొండంత అండగా నిలిచింది. మనపుగాకు తీసుకొని అత్యాధునిక ఓ.ఎన్.జి.సి., ఐ.డి.పి.ఎల్., విశాఖస్టీల్‌వంటి సంస్థలనిర్మాణానికి సహకరించింది. ఈ సహకారం ఆరోగ్యకరం. వాంఛనీయం.

కానీ అమెరికా చెప్పేది 'బడితవున్నవాడిదే రాజ్యం' సిద్ధాంతం. 1990కి పూర్వం బలమైన సోవియట్, అమెరికా దుర్మార్గాలకు ఎదురునిలిచింది. ఇపుడు సోవియట్ లేదు. అమెరికా సెల్‌ఫోన్లు, ఔషధాలు, కంప్యూటర్‌లు, కార్లు దిగుమతులకు మనపాలకుల ద్వారాలు తెలిచారు. కానీ మనరొయ్యలు, నూలుబట్టలు, స్టీల్ వగైరాలపై అమెరికా ఆంక్షలు విధించటం అన్యాయం.

చైనా డబ్లు.టి.ఓ.లో చేరింది కదా?సమ ఉజ్జీల మధ్య కుస్తీ పోటీమంచిదే. ప్రతి రంగంలోనూ అమెరికాతో పోటీ పడగలసత్తా చైనాకు వుందని అందరూ అంగీకరిస్తున్నారు. కేవలం డబ్ల్యు.టి.ఓలో చేరటం, ప్రపంచీకరణకు ద్వారాలు తెరవటవల్లే ఇది సాద్యమైందని అర్ధసత్యాలు ప్రచారం చేస్తున్నారు. 1979లో సంస్కరణలప్రక్రియ ప్రారంభానికిముందే 3 దశాబ్దాల సోషలిజంనిర్మాణం చైనా అభివృద్ధికి బలమైన పునాదివేసిందన్నది చారిత్రకసత్యం. ఆ సోషలిస్టుపునాది బలంతోనే డబ్ల్యు.టి.ఓ.ను ప్రపంచీకరణను తన దేశ అభివృద్ధికి అనుకూలంగా చైనా మలుచుకోగల్గుతున్నది. విదేశీ పెట్టుబడులపైనఆదేశంలోని విదేశీసంస్థలపై తనపట్టు నిలుపుకుంటున్నది. కార్మికచట్టాలు అమలుపరచాలని, అమెరికా, జపాన్ వంటి విదేశీ కంపెనీలను బ్లాక్‌లిస్టులో పెడతాననిబెదిరించి అదుపులో వుంచగల్గుతున్నది. అందుకే చైనాతో మనకు పోలికలేదు.

పరిమితులు అధిగమిద్దాం : కొత్తపేటెంట్ ఆర్డినెన్స్ పట్ల కొందరు మేధావులు, మధ్యతరగతి ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలలో భ్రమలు ఉన్నాయి. ఈ అంశంపై పాలక పార్టీలన్నీ ఏకంగా ఉన్నాయి. స్వదేశీ, విదేశీపెట్టుబడిదారుల, వారి మీడియా ప్రచారాలకు లోనవుతున్నారు. దీని ప్రభావం ప్రతిఘటన ఉద్యమాలకు కొంత ఆటంకం కల్గిస్తున్నది. ఈ ఆటంకాలను అధిగమించాలి.

ఇంత పెద్ద ప్రమాదాన్ని ప్రతిఘటించి తిప్పి కొట్టగలమా? 1920కి ముందు భారత్ నుండి తెల్లదొరలను తరిమికొట్టగలమన్న నమ్మకం వుండేదా? 1947 నాటికి ఆ లక్ష్యం సాధించబడింది. ప్రజలే చరిత్ర నిర్మాతలన్నారు మార్క్స్‌మహాశయుడు. వారిని కదిలించాలి. చీకటిని తిట్టుకుంటూ కూర్చోవటంకాదు. చిరుదీపం వెలిగించటం మంచిది కదా? అందుకే డబ్ల్యు.టి.ఓ.కి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని ప్రజాఉద్యమంగా మార్చేందుకు కృషిచేద్దాం.

థైరాయిడ్ బెంగ

డాక్టర్... డాక్టర్...

థైరాయిడ్ హార్మోన్లు... మన శరీరం మొత్తానికి చురుకెక్కించే హార్మోన్లు! ఇవి స్త్రీ ల జీవితంలో చాలా కీలక పాత్ర పోషిస్తాయి. మరీ ముఖ్యంగా స్త్రీ ల సంతాన సామర్థ్యాన్ని ఇవి బాగా ప్రభావితం చేస్తాయి. ఈ హార్మోన్లు తక్కువైనా.. లేక ఎక్కువైనా కూడా గర్భిణుల్లో రకరకాల సమస్యలు తలెత్త వచ్చు. కాబట్టి గర్భవతులూ... బిడ్డలు కావాలనుకుంటున్న స్త్రీ లంతా కొన్ని జాగ్రత్తలు తీసుకోక తప్పదు.

✚ థైరాయిడ్ హార్మోన్ లోపం ఉన్న స్త్రీ గర్భం దాలిస్తే..?

హైపోథైరాయిడిజం సమస్య ఉన్న స్త్రీలకు గర్భం దాల్చే అవకాశాలు తక్కువ. కానీ చాలామంది ఈ సమస్యకు చికిత్స తీసుకోవటం ఆరంభించిన తర్వాత తేలికగానే గర్భం దాలుస్తారు. అయితే వీళ్లు థైరాయిడ్ మందుల విషయంలో కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోక తప్పదు. కడుపులో పెరుగుతున్న బిడ్డ మెదడు ఎదుగుదలలో థైరాయిడ్ హార్మోన్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది. కాబట్టి థైరాయిడ్ మందులను మొదటి 3 నెలలూ కూడా తీసుకోవాల్సిందే. కడుపులో పెరుగుతున్న బిడ్డ తనకు కావాల్సిన థైరాయిడ్ హార్మోన్‌ను మొదటి మూడు నెలలూ తల్లి నుంచే తీసుకుంటుంది. ఆ తర్వాత బిడ్డలో కూడా థైరాయిడ్ గ్రంథి ఎదిగి, అది పని చేయటం ఆరంభిస్తుంది కాబట్టి అప్పుడు తల్లి మీద ఆధారపడటం కొంత తగ్గుతుంది. అయినా గర్భిణులు థైరాక్సిన్ మందులను కొనసాగించాల్సిందే. కొన్నిసార్లు నెలలు నిండుతున్న కొద్దీ ఈ హార్మోన్ అవసరం పెరుగుతుంటుంది. కాబట్టి ఈ హైపోథైరాయిడిజం సమస్య ఉన్న గర్భిణులు ప్రతి 2-3 నెల్లకోసారి 'సీరంటీఎస్‌హెచ్' పరీక్ష చేయించుకుంటూ, ఒంట్లో ఈ హార్మోన్ స్థాయిలను బట్టి మందుల డోసు మార్చుకోవాల్సి ఉంటుంది. తల్లి ఈ మందులు సక్రమంగా వాడుకుంటే ఆమెకు పుట్టే బిడ్డలు పూర్తి ఆరోగ్యవంతంగా ఉంటారు.

ఒకవేళ హైపోథైరాయిడిజం ఉండి కూడా, గర్భిణీ ఎటువంటి చికిత్సా తీసుకోకపోతే- బిడ్డ మరీ పెద్దగా ఎదగవచ్చు. కొన్నిసార్లు బిడ్డలు బుద్ధిమాంద్యంతో పుట్టే అవకాశాలూ ఉంటాయి.

✚ థైరాయిడ్ హార్మోన్ ఎక్కువ వున్న స్త్రీ లు గర్భం దాలిస్తే...?

హైపోథైరాయిడిజం ఉన్న స్త్రీలకు కూడా సంతానావకాశాలు తక్కువ. అయితే వీరికి కూడా చికిత్స తర్వాత గర్భధారణ అవకాశాలు పెరుగుతాయి. గర్భం దాల్చిన తర్వాత కూడా వీళ్లు కార్బిమజోల్ వంటి యాంటీ-థైరాయిడ్ మందులు కొనసాగించాల్సిందే. కాకపోతే హైపోథైరాయిడిజం ఉన్న వారిలోలాగా నెలలు నిండినప్పుడు ఈ మందుల డోసు పెంచాల్సిన అవసరం ఉండదు. పైగా కొన్నిసార్లు తగ్గించాల్సి ఉంటుంది. మందుల డోసు పెంచటమా? తగ్గించటమా? అన్నది వైద్యులు క్రమం తప్పకుండా థైరాయిడ్ పరీక్షలు చేసి నిర్ధారిస్తుంటారు. గర్భిణులు దీనికి సరిగా చికిత్స తీసుకోకపోతే (ముఖ్యంగా ఆఖరి మూడు నెలల్లో) ఈ హైపోథైరాయిడిజం సమస్య వారికి పుట్టే బిడ్డలక్కూడా రావచ్చు. ఇది చాలా ప్రమాదకరమైన స్థితి. అలాగే గర్భిణికి గుండెకు సంబంధించిన సమస్యలేవైనా ఉంటే ఈ హైపోథైరాయిడిజం వల్ల అవి పెరిగే అవకాశం ఉంటుంది.

ముఖ్యంగా: సహజంగానే గర్భిణుల్లో టి3, టి4 హార్మోన్లు కొంత ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది కాబట్టి గర్భిణుల్లో థైరాయిడ్ హార్మోన్ స్థాయిలను తెలుసుకోవటానికి సాధారణంగా చేసే 'సీరం టి3, సీరం టి4' పరీక్షలు కాకుండా 'సీరం ఫ్రీ టి3, సీరం ఫ్రీ టి4' పరీక్షలు చేయించాల్సి వుంటుంది.



✚ గర్భిణులకు థైరాయిడ్ మందులు సురక్షితమేనా?

థైరాయిడ్ హార్మోన్లు అస్తవ్యస్తంగా తయారైనప్పుడు ఇచ్చే మందులు ప్రధానంగా:

☛ **థైరాక్సిన్:** థైరాయిడ్ హార్మోన్లు లోపించిన వారికి ఇచ్చే ఈ మందులు రక్తంలో థైరాయిడ్ హార్మోన్ స్థాయిలను పెంచుతాయి. ఇవి మన మార్కెట్లో ఎల్ట్రాక్సిన్, థయోనార్మ్, థైరాక్స్ వంటి పేర్లతో దొరుకుతున్నాయి. గర్భిణులకు ఇవి చాలా సురక్షితమైనవి. వీటిని మొదటి మూడు నెలల్లో కూడా వేసుకోవాల్సిందే. ఒకవేళ గర్భిణి ఈ మందులను మానేస్తే కడుపులోని బిడ్డకు థైరాయిడ్ హార్మోన్ తగినంతగా అందక చాలా సమస్యలు తలెత్తుతాయి.

☛ **యాంటీ-థైరాయిడ్ మందులు:** థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా ఉన్న వారికి ఇచ్చే ఈ మందులు రక్తంలో థైరాయిడ్ హార్మోన్ స్థాయిలను తగ్గిస్తాయి. మార్కెట్లో కార్బిమజోల్, ప్రొపైల్‌థియోరాసిల్ వంటి పేర్లతో దొరుకుతున్నాయి. గర్భిణులకు ఈ రెండూ సురక్షితమైనవే గానీ సాధారణంగా ఆ సమయంలో వైద్యులు రెండోదాన్నే ఎక్కువగా సిఫార్సు చేస్తారు. నెలలు నిండుతున్న కొద్దీ ఒంట్లో హార్మోన్ స్థాయిలు సరిచూసుకుంటూ ఈ మందుల మోతాదు తగ్గించాల్సి వుంటుంది.

✚ మామూలు గర్భవతుల్లోనూ... అసలు ఎటువంటి థైరాయిడ్ సమస్యలూ లేని సాధారణ ఆరోగ్యవంతులైన స్త్రీలకు కూడా గర్భంతో ఉన్నప్పుడు థైరాయిడ్ సమస్యల్లాంటి లక్షణాలు కనబడే అవకాశం వుంది. గర్భిణుల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ చాలా ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల 'థైరాయిడ్ బైండింగ్ గ్లోబ్యులిన్ (టిబిజి)' కూడా పెరుగుతుంది. వీటి పర్యవసానంగా - గర్భిణుల్లో థైరాయిడ్ (టీ3, టీ4) హార్మోన్ల స్థాయిలు కాస్త ఎక్కువగా కనబడతాయి. గర్భవతుల్లో గొంతు దగ్గర కొద్దిపాటి థైరాయిడ్ వాపు (గాయిటర్) సహజంగానే కనబడుతుంటుంది. అయినా దీనికి ఎటువంటి చికిత్సా అవసరం ఉండదు. కాకపోతే గర్భిణుల్లో థైరాయిడ్ వ్యాధి ఉందని నిర్ధారించుకునే విషయంలో మాత్రం జాగ్రత్త అవసరం.

✚ కాన్పు తర్వాత... కాన్పు తర్వాత 3 నుంచి 6 నెలలకు చాలా మంది స్త్రీలలో థైరాయిడ్ సమస్యలు తలెత్తుతుంటాయి. తల్లి రక్తంలో రోగనిరోధక వ్యవస్థ మార్పులకు లోనవ్వటమే దీనికి కారణం.

■ *డా॥కె.డి.మోడి*
ఎండోక్రినాలజిస్ట్, మెడ్విన్ హాస్పిటల్స్

బాలాజీ హేచరీస్ కార్మికుల పోరాటం-అనుభవాలు



బాలాజీ హేచరీస్ మరియు వి.ఎస్.ఎన్. హేచరీస్‌లో 600 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరు చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, యాదమరి, పెద్దపంజాని మరియు గంగవరం మండలాల్లోని హేచరీస్ మరియు కోళ్లఫారాల్లో పని చేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీసవేతనాలు, పనిగంటలు, జాతీయ పండుగ సెలవులు, బోనస్, కార్మిక చట్టాలు అమలు జరపకుండా మేనేజ్‌మెంటు వేధింపులకు పాల్పడుతుంటే కార్మికులు ఐక్యమై సి.ఐ.టి.యు. నాయకత్వంలో యూనియన్ రిజిష్టర్ చేసుకున్నారు.

సి.ఐ.టి.యు. యూనియన్‌ను సహించలేని హేచరీస్ యాజమాన్యం యూనియన్ నాయకులను డ్యూటీలకు తీసుకోకుండా హైదరాబాదు, గుంతకల్లు, కడపలకు అక్రమంగా బదిలీ చేసింది. కార్మికులు ఆందోళనకు పూనుకుంటే 2000 సం॥ నుండి అమలు చేయవలసిన కనీసవేతనాలను 2003 ఆగస్టు నుండి మాత్రమే అమలు చేసింది. యూనియన్‌ని లేకుండా చేయడానికి యూనియన్ కార్యకర్తలను సస్పెండ్ చేసింది. కార్మికులపై పోలీసుచే తప్పుడు కేసులు పెట్టించింది. యాజమాన్యం యొక్క దుర్మార్గానికి వ్యతిరేకంగా 2004 ఫిబ్రవరి నుండి కార్మికులు దశలవారి ఆందోళనను చేపట్టారు. మార్చిలో 8 రోజులు వివిధ రూపాలలో ఆందోళనలు, తిరుపతిలోని అసిస్టెంట్ లేబర్ కమీషనర్ కార్యాలయాన్ని పికెటింగ్ చేసి అరెస్టు కావడం జరిగింది.

యాజమాన్యం చేసిన బదిలీలు చెల్లవని కార్మికశాఖ అధికారులు స్పష్టం చేసినప్పటికి యాజమాన్యం ఖాతరు చేయకుండా కార్మికులను బెదరించడం మరింత మందిని బదిలీ చేసినందుకు వ్యతిరేకంగా యూనియన్ నాయకత్వంలో 700 మంది కార్మికులు 27.7.2004న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్మికుల కోరికలను అంగీకరించాలని డిమాండ్ చేస్తూ 117 రోజులు నిరాహార దీక్షలను 28-6-2004 నుండి 22-10-2004 వరకు చేపట్టారు. 22-10-2004న చిత్తూరు ఆర్.డి.ఓ సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందములోని ప్రధాన సమస్యలను యాజమాన్యం పరిష్కారం చేయక కార్మిక వ్యతిరేక చర్యలను మరింత ఎక్కువ చేసింది. జిల్లా కలెక్టరు మొదలుకొని రాష్ట్ర లేబర్ కమీషనర్ ఇచ్చిన సలహాలను సహితం యాజమాన్యము ఖాతరు చేయులేదు. కార్మికులకు వ్యతిరేకంగా కోళ్ళరైతులను యాజమాన్యం సమీకరించి ఆందోళన చేయించింది. 2004 సం॥ ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఫౌల్ట్రీ రంగ కార్మికులకు నిర్ణయించిన కనీసవేతనం రూ.1970/-లు అమలును సవాలు చేస్తూ యాజమాన్యం హైకోర్టులో పిటిషన్ వేసింది.

అంగీకరించిన అంశాలను,కనీసవేతనాన్ని అమలు చేయాలని ఆందోళన చేస్తున్న కార్మికులను పట్టించుకోని యాజమాన్యం వేధింపులను తీవ్రతరం చేసింది. కార్మికులు 8-1-2005 నుండి 20రోజుల పాటు నిర్వధిక సమ్మె చేశారు. కోళ్ళరైతులను అడ్డం పెట్టుకొని సమ్మెలో ఉన్న కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించాలని యాజమాన్యం ప్రయత్నించింది. దీనికి నిరసనగా 19-01-2005న చిత్తూరులో జరిగిన శాసనసభా హక్కుల కమిటీ సమావేశాన్ని హేచరీస్ కార్మికులు అడ్డుకున్నారు. ఫలితంగా చైర్మన్ ప్రతాపరెడ్డిగారు సమ్మెలో ఉన్న కార్మికులను బేషరతుగా డ్యూటీలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టరును, ఎసిఎల్‌ను ఆదేశించారు. యాజమాన్యం ఖాతరు చేయలేదు. దీనితో ఆగ్రహించిన కార్మికులు 24-1-2005న చిత్తూరులో రాస్తారోకో చేస్తుంటే 80 మందిని అరెస్టు చేశారు. అదే రోజు చిత్తూరులో ఉన్న రాష్ట్ర రెవిన్యూ శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరు చొరవతో 27-01-2005న చిత్తూరులో డిప్యూటి లేబర్ కమీషనర్ (కర్నూలు) గారి సమక్షంలో జాయింటు మీటింగ్ ఏర్పాటుకు నిర్ణయం జరిగింది. 115 మంది కార్మికులలో 55 మందికి మాత్రమే ఉద్యోగాలిస్తామని మిగతా కార్మికులపై విచారణ జరిపి వారి గురించి తరువాత నిర్ణయిస్తామని యాజమాన్యం తన వాదనలను డిసిఎల్ కు చెప్పి మరోకసారి తన కార్మిక వ్యతిరేక వైఖరిని ప్రదర్శించింది. అయినప్పటికీ 55 మంది కార్మికులను పనిలోకి తీసుకోవడానికి వ్రాతపూర్వక అవగాహన కుదిరింది. 28-1-2005న కార్మికులు సమ్మెను విరమించారు. హేచరీస్ కార్మికులు చేసిన పోరాటానికి సి.ఐ.టి.యు. రాష్ట్ర, జిల్లా కేంద్రాలు అన్ని సందర్భాల్లో సహాయ సహకారాలను అందించాయి. సి.ఐ.టి.యు. సంఘాలు హేచరీస్ కార్మికులకు సంఘీభావంగా సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించాయి.

అనుభవాలు

1. హేచరీస్ యాజమాన్యం యొక్క దుర్మార్గాలకు వ్యతిరేకముగా కార్మికులు సిఐటియు నాయకత్వంలో మొక్కవోని దీక్షతో చేసిన సమరశీల పోరాటాల ఫలితంగా కనీసవేతనాలు, పనిగంటలు, బోనస్‌ను కార్మికులు సాధించుకున్నారు.
2. హేచరీస్ యాజమాన్యం చేపట్టిన కార్మిక వ్యతిరేక చర్యలకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి సహకారాన్ని అందించి యజమానుల అనుకూల వైఖరిని చాటుకుంది.
3. గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించియున్న కోళ్ళఫారాల రైతులను యాజమాన్యం అడ్డం పెట్టుకొని కార్మికులకు వ్యతిరేకంగా ఉపయోగించుకున్నది.
4. ఉద్యోగాలు పోతాయని తెలిసినప్పటికి కార్మికులు తెగించి సమ్మెచేశారు.

■ పి.చైతన్య
సిఐటియు చిత్తూరు జిల్లా అధ్యక్షులు

సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాల కోసమే ప్రపంచీకరణ



సెమినార్‌లో ప్రసంగిస్తున్న ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ ఎస్.వెంకట్రావ్

పీపుల్ ఫర్ ఇండియా ఫోరమ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో "ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలు- అనుభవాలు" అనే అంశంపై సెమినార్ జరిగింది. అందులో ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ శ్రీ.ఎస్.వెంకట్రావ్ ప్రధాన వక్తగా ప్రసంగించారు. ఫోరమ్ చిలకలూరిపేట చైర్మన్ బి.వీరాంజనేయులు అధ్యక్షత వహించారు.

హమాలీ కార్మికుల సదస్సు



సివిల్ సప్లై, యస్.డబ్ల్యు.సి., మార్కెట్ యార్డుల హమాలీ కార్మికుల మెదక్ జిల్లా సదస్సులో హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సదస్సుకు కిషన్ అధ్యక్షత వహించారు. సదస్సులో సి.ఐ.టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజయ్య, ఉపాధ్యక్షులు సర్దార్, జయరాజు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన హమాలీ నాయకులు ప్రసంగించారు. సత్యనారాయణ, సత్తయ్య, ప్రహ్లాద్, మల్లేష్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగులచే కలెక్టరేట్ల పికెటింగ్



శ్రీకాకుళం



సంగారెడ్డి

కాకినాడలో 70 మంది అరెస్టు, అందరిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెట్టారు

ఎపిఎస్ఇబి 6వ వర్ధంతి సంతాపసభ



నెల్లూరులో ఎ.పి.ఎస్.ఇ.బి. 6వ వర్ధంతి సభా దృశ్యం

పారామెడికల్ ఉద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

ఎ.పి.మెడికల్, హెల్త్ & వైద్య విధాన పరిషత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వైద్య ఆరోగ్య రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం గుంటూరులోని స్థానిక యుటిఎఫ్ హాలులో జరిగినది.

వైద్య ఆరోగ్య కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంటు చేయాలి



వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సంగారెడ్డిలో జరిగిన జిల్లా స్థాయి సమావేశం డిమాండ్ చేసింది. సమావేశం అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్దకు ప్రదర్శనగా వెళ్ళి ధర్నా నిర్వహించారు. తదుపరి జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సి.ఐ.టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజయ్య, ఉపాధ్యక్షులు సర్దార్, కార్యదర్శి మానిక్ తదితరులు నాయకత్వం వహించారు.

ప్రమోషన్ల కౌన్సిలింగ్ నిలివేతకు నిరసనగా ధర్నా

గుంటూరులో ధర్నా నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య రంగ ఉద్యోగులు

వైద్య, ఆరోగ్య రంగంలో గుంటూరుజోన్ (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు)లో ఎంపిహెచ్ఎ (మగ) నుండి ఎంపిహెచ్ఎస్ (మగ)కు ప్రమోషన్లు ఇచ్చేందుకు ఫిబ్రవరి 15వ తేదీన కౌన్సిలింగ్ ప్రకటించి 14వ తేదీ రాత్రి అర్ధంతరంగా కౌన్సిలింగ్ నిలిపివేశారు. దానికి నిరసిస్తూ తక్షణం కౌన్సిలింగ్ జరిపి ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ ఎ.పి.మెడికల్, హెల్త్ & వైద్య విధాన పరిషత్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.

ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.భానుమూర్తి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు వై.నేతాజి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌డి.ఎం. హుస్సేన్, ఉపాధ్యక్షులు జి.విక్టర్‌బాబు, జిల్లా నాయకులు కె.శ్రీనివాసరావు, ఎల్.ఎన్.భారవి, ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.మల్లికార్జునరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, అధ్యక్షులు నాగరాజు తదితరులు ప్రసంగించారు. అనంతరం ఇన్‌చార్జి ఆర్.డి. డా॥ఎం.సోనార్‌బాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.జనార్ధనరెడ్డి లకు మెమొరాండం సమర్పించారు.

తెనాలి డివిజన్ విద్యావలంటీర్ల నూతన కమిటీ ఎన్నిక

ఉద్యోగ భద్రత కల్పించేవరకు విద్యావలంటీర్లు పోరాడాలని ఎ.పి.స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ సి.హెచ్.నాగబ్రహ్మచారి కోరారు. తెనాలి డివిజన్ విద్యావలంటీర్ల సమావేశం 22-2-05న తెనాలి సిఐటియు కార్యాలయంలో కె.వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిఐటియు తెనాలి డివిజన్ కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రసంగించారు.

నూతన కమిటీ : గౌరవాధ్యక్షులుగా కె.ఉమామహేశ్వర రావు (సిఐటియు డివిజన్ కార్యదర్శి) అధ్యక్ష, కార్యదర్శులుగా బి.మరియ దాసు, పి.అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా టి.వెంకటరమణ, వి.సునీతారాజకుమారి, సహాయకార్యదర్శి జాకీర్ అహ్మద్, ట్రెజరర్‌గా వై శివపార్వతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కట్టా వీరయ్యలతో మొత్తం 9 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనది.

❑ ఉద్యమవార్తలు

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి



ఆర్ఎం ఆఫీసు ఎదుట జరిగిన ధర్నా,
ధర్నాలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఎస్.డబ్ల్యు.ఎఫ్. ఉపాధ్యక్షులు
కె.జయరామిరెడ్డి

నెల్లూరు జిల్లా రాపూరు డిపో కండక్టర్లు ఎ.వి.రెడ్డి, పి.జె.ఖాన్‌ల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నెల్లరు రీజినల్ మనేజరు కార్యాలయం వద్ద ఎస్.డబ్ల్యు.ఎఫ్. నెల్లూరు రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అంతకు ముందు 400 మంది కార్మికులతో ప్రదర్శన జరిగింది. ధర్నాకు రీజినల్ అధ్యక్షుడు పి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ధర్నాలో సి.ఐ.టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి నారు కిష్ణయ్య, పట్టణ కార్యదర్శి మోహనరావు, ఎస్.డబ్ల్యు.ఎఫ్. రీజినల్ కార్యదర్శి నరసింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జయరామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, యం.శేషయ్య, యం.నాగేంద్ర రావు, ఎం.ఆర్.రెడ్డి, యన్.కామాక్షమ్మ, కె.వి. శివాజీ, ఎస్.కె.ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు. ■

❑ మహాసభలు

బ్యాంకింగ్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడుదాం!

బిఇఎఫ్ఐ-ఎపి 5వ మహాసభ పిలుపు

బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-ఆంధ్రప్రదేశ్ శాఖ 5వ మహాసభ ఫిబ్రవరి 13వ తేదీన మహబూబ్ నగర్‌లో జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు మహాసభను ప్రారంభించారు.

ముఖ్యఅతిధి కా॥సమీర్‌ఘోష్, ఆల్ ఇండియా రిజర్వ్‌బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజకీయ చైతన్యంతో బ్యాంకు ఉద్యోగులు చేసిన పోరాటాల చరిత్రను గుర్తు చేశారు.

మహాసభనుద్దేశించి కా॥సుధాభాస్కర్- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, కా॥వెంకటేశ్వరరెడ్డి- గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ప్రసంగించారు.

మహాసభ బ్యాంకింగ్ రంగ సంస్కరణలకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనాలకు వ్యతిరేకంగా, 8వ వేతన ఒప్పందం, పెన్షన్ స్కీం, గ్రామీణ బ్యాంకుల పరిరక్షణ మీద తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించింది.

అధ్యక్షులు పి.ఎల్.ఆనందరెడ్డి- వెంకటేశ్వర గ్రామీణ బ్యాంక్, ప్రధాన కార్యదర్శి సుధాకర్- యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ తో సహా 19 మంది ఆఫీస్‌బేరర్లతో కూడిన నూతన కమిటీ మహాసభలో ఎన్నికైంది.

■ పి.వెంకటరామయ్య

గ్రామసేవకుల రిలేదీక్షలు

ప్రభుత్వం తమకిచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రేదశ్ గ్రామసేవకుల సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28 నుండి హైదరాబాద్‌లో జరుగుతున్న రిలేనిరాహారదీక్షలను ప్రారంభిస్తున్న సి.పి.ఎం. ఎం.ఎల్.ఎ. జూలకంటి రంగారెడ్డి.

సింగరేణి కార్మికుల ఛలో హైదరాబాద్

బొగ్గుగని కార్మికులకు అమలు కావలసిన 7వవేతన ఒప్పందాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని, సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జరిగిన ఛలో హైదరాబాద్ ■

మహాసభ

నాలుగు ప్రభుత్వరంగ సాధారణ భీమా కంపెనీలను విలీనం చేయాలి!



హైదరాబాద్ రీజియన్ జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 17వ మహాసభలను హైదరాబాద్ నగరంలో 24-26, జనవరి 2005వ తేదీలలో జరిగాయి. 250 మంది ప్రతినిధులు, పరిశీలకులు సభకు హాజరైనారు. డి.బుచ్చిరెడ్డి సంఘ పతాకం ఆవిష్కరణ చేశారు. ఆహ్వానసంఘం అధ్యక్షులు, ప్రముఖ విద్యావేత్త శ్రీ చుక్కా రామయ్య అధ్యక్షోపన్యాసము చేశారు.

కె.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి, ఎఐఐఇఎ మహాసభలను ప్రారంభిస్తూ ఉపన్యసించారు. పార్లమెంటులో ఎఫ్‌డిఐ పెంపుకై ఐఆర్‌డిఎ చట్టం సవరణ తీసుకొని రావడానికి బిల్లు ప్రవేశపెడితే ఒకరోజు సమ్మెలోకి వెళ్ళడానికి సిద్ధంగా వుండాలని కోరారు.

ముఖ్యఅతిధిగా విచ్చేసిన కార్యదర్శి, సిపిఐ(ఎం) ఎ.పి. కమిటీ బి.వి.రాఘవులు ఉద్యోగులు, కార్మికులు మరియు ప్రజలు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. ఈ చర్యలను ఎదుర్కొవడానికై విస్తృతమైన వేదిక అవసరమని చెప్పారు. బిజెపి ప్రజల సమస్యలపై స్పందించకుండా మిగతా సమస్యలపై స్పందిస్తూ ప్రజలను, జాతిని విచ్ఛిన్నకరమైన విధానాల వైపు మళ్ళిస్తుందని తెలిపారు. వీటిని మనం గమనించి త్రిప్పికొట్టాలన్నారు. నగర సిఐటియు నాయకులు వి.కామేష్‌బాబు మరియు వి.రమేష్, ప్రధాన కార్యదర్శి, SCZIEF సందేశాలను ఇచ్చారు.

ప్రతినిధుల సభలో ప్రధాన కార్యదర్శి కె.విజయభాస్కర్‌రెడ్డి నివేదికను ప్రవేశపెట్టారు. నివేదిక పై 30 మంది చర్చలలో పాల్గొని కొన్ని సూచనలు చేశారు. ప్రతినిధుల సభలో సౌత్‌జోన్ ప్రధాన కార్యదర్శి పి.వి.నందకుమార్ మాట్లాడారు.

<u>నూతన నాయకత్వం :</u> **అధ్యక్షులు**-డి.బుచ్చిరెడ్డి, **ఉపాధ్యక్షులు** -ఎన్.శంకరరెడ్డి, జి.సారంగపాణి, ఎమ్.వి.కృష్ణారావు, **ప్రధాన కార్యదర్శి**- కె.విజయభాస్కరరెడ్డి, **సంయుక్త కార్యదర్శులు**- కె.వి.వి. యస్.యన్.రాజు, ఎన్.ఎస్.శైలజ, జి.రాజేశమ్, ఎ.రాజశేఖర్, ఎస్.శ్రీనివాసరావు, వై.సుబ్బారావు, సీలంరాజు, ఎ.హెచ్.కిషోర్, **కోశాధికారి**-ఎ.నారాయణరావు, మరో 14 మందితో రీజనల్ కార్యవర్గం ఎన్నికయింది. ■

సదస్సులు

వామపక్షాలు బలపడితేనే పాలకులకు కళ్లెం

సదస్సులో ప్రసంగిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ వి.శ్రీనివాసరావు

ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాల చట్రంలోనే నిర్ణయాలు తీసుకుంటున్న పాలకులకు కళ్లెం వేయడం వామపక్షాలు బలపడటం ద్వారానే సాధ్యమవుతుందని ప్రజాశక్తి సంపాదకులు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిఐటియు విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సభకు సి.ఐ.టి.యు. నగర అధ్యక్షుడు టి.సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. నగర ప్రధాన కార్యదర్శి ఆర్.రఘు కూడా సభలో ప్రసంగించారు.

కడపనగర సదస్సు

సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ఉపాధ్యక్షులు కా॥బి.నారాయణ

కడపనగర సి.ఐ.టి.యు. సదస్సు పి.మల్లికార్జునరాజు అధ్యఓతన జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులు బి.నారాయణ ప్రారంభ ఉపన్యాసం చేశారు. జిల్లా అధ్యక్షులు రఘునాథ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.రవిశంకరరెడ్డి తదితరులు సందేశం ఇచ్చారు.

నూతన కమిటీ: అధ్యక్షులు ఎస్.షబ్బీర్‌బాషా, ఉపాధ్యక్షులు డి.రాజకుల్లాయమ్మ, వడ్లపల్లె రవి, ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్దరామయ్య, కార్యదర్శులు కె.శ్రీనివాసుల రెడ్డి, బి.ఓబయ్య, కె.తిరుపాల్, కోశాధికారి పి.వి.ఎస్.కృష్ణ. 14 మందితో కమిటీ ఏర్పడింది.

జయప్రదంగా ముగిసిన APMHVVPEU (సిఐటియు) 3వ రాష్ట్ర మహాసభలు



ఎ.పి.మెడికల్, హెల్త్ & వైద్య విధాన పరిషత్ ఎంప్లాయీస్ యూనియన్ రి.నెం.బి-2555 (సిఐటియు) రాష్ట్ర 3వ మహాసభలు ఫిబ్రవరి 13,14 తేదీల్లో 2005న డా॥కొట్నీస్ ప్రాంగణం (మున్సిపల్ హైస్కూల్ (గ్రౌండ్స్, గాంధీనగర్) కాకినాడలో ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ.వి.రాజగోపాల్ పతాకావిష్కరణతో ప్రదర్శన యుటిఎఫ్ భవనం నుండి ప్రధాన వీధులగుండా, డా॥కొట్నీసు ప్రాంగణానికి చేరుకుంది. వివిధ జిల్లాల నుండి హాజరైన 500 మంది ఉద్యోగులు ప్రదర్శనలో పాల్గొన్నారు. రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో భద్రాచలం పార్లమెంట్ సభ్యులు డా॥మిడియం బాబూరావు, రాష్ట్ర సిఐటియు ప్రధాన కార్యదర్శి కా॥ఎస్.వీరయ్య, శ్రామిక మహిళా జాతీయ కమిటీ సభ్యురాలు గీత, సిఐటియు తూ.గోదావరి జిల్లా కార్యదర్శి కా॥శేషబాబ్జీ, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం.రంగయ్య, గౌరవాధ్యక్షులు వెంకటాచారి, కార్యదర్శి భూపాల్, మహిళా విభాగం నాయకురాలు శ్రీమతి రోజా పాల్గొన్నారు.

అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో 300 మంది పాల్గొనగా వివిధ జిల్లాల నుండి 25మంది చర్చల్లో పాల్గొన్నారు. కార్యదర్శి నివేదికను ఎం.రంగయ్య, ఆర్థిక నివేదికను శ్రీ కె.రామనాథం ప్రవేశ పెట్టారు. చర్చల అనంతరం నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉద్యోగులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలపై ఈక్రింది తీర్మానాలు చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవు మంజూరు చేయాలని, వైద్య విధాన పరిషత్‌లో పని చేసే ఉద్యోగులకు పెన్షన్, కంపాషినేట్ నియామకాలు కొనసాగించాలని, అన్ని క్యాడర్స్‌కు ప్రమోషన్స్ విధానం, బదిలీవిధానం సంఘాలతో చర్చించి రూపొందించాలని, గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, రాష్ట్ర స్థాయి తోపాటు, జిల్లా స్థాయిలో గుర్తింపు ఇవ్వాలని, మెడికల్‌కు, హెల్త్‌కు వేరువేరుగా కాక కలిపి ఒకే గుర్తింపు ఇవ్వాలని తీర్మానించారు.

వృత్తిపన్ను రద్దుచేసి, పి.ఆర్.సి. ప్రకటించాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని, థర్డ్‌పార్టీ కాంట్రాక్టు విధానం రద్దు చేసి, క్యాజువల్ కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని తీర్మానించారు.

మెడికల్, హెల్త్, కాంట్రాక్టు, మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రతినిధులు గ్రూపులుగా విడిపోయి ప్రత్యేకంగా చర్చించారు. సమస్యలను గుర్తించారు.

అనంతరం 59 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా శ్రీ ఎం.రంగయ్య, ప్రధాన కార్యదర్శిగా వి.రాజగోపాల్, కోశాధికారిగా రోజారాణి, కార్యదర్శిగా భూపాల్ తోపాటు ఎస్.లక్ష్మణరావు, వెంకటాచారి, వేణుగోపాల్, జి.రాజశేఖర్, బి.ఎన్.ఎస్.ప్రసాద్, భానుమూర్తి, శ్రీనివాసరావు, కె.ఎస్.ఎన్.రాజు, సుచరిత, ప్రభుజి, జె.సూర్యానారయణ, సోమేశ్వరరావు, వెంకట శేషయ్య, బలరాం ఆఫీసుబేరర్స్‌గా ఎన్నికయ్యారు.

గత కమిటీలో పని చేసి రిలీవు అవుతున్న 20 మంది సభ్యులకు మహాసభ కృతజ్ఞతలు తెల్పింది. ■

తెనాలిలో డాల్‌మిల్ వర్కర్స్ సమావేశం

తెనాలి డాల్‌మిల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జనరల్‌బాడీ సమావేశంలో ప్రసంగిస్తున్న తెనాలి ఎంఎల్ఎ నాదెండ్ల మనోహర్, వేదిక సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సుబ్బారావు, కె.ఉమామహేశ్వరరావు జి.సుబ్బారెడ్డి ప్రభృతులు

మార్చి 14న అంగన్‌వాడీ ఉద్యోగుల ఛలో హైదరాబాద్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 14న ఛలో హైదరాబాద్ జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న అదనపు పనికి అదనపు వేతనం, నెలనెలా వేతనాల చెల్లింపు, పెన్షన్ గ్రాట్యుటీ మొ॥ రిటైర్‌మెంటు బెనిఫిట్స్, ప్రమోషన్స్ తదితర సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోనున్న ప్రతి అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పాల్గొనాలని కోరుతున్నాము.

కాంట్రాక్టు కార్మికులను దగా చేసిన ప్రభుత్వం

కాంట్రాక్టు కార్మికుల వేతన సవరణ చేస్తూ 27.1.2005న జి.వో.నెం.40ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అన్‌స్కిల్డ్‌కు రూ.2386/-లు, సెమిస్కిల్డ్‌కు రూ.3020/-లు, స్కిల్డ్‌కు రూ.3654/-లు నెల వేతనాలుగా నిర్ణయించారు. ఈ పెంపుదల కాంట్రాక్టు కార్మికులను దగా చేసేదిగా ఉంది. గతంలో ఎన్నడు లేని విధంగా డ్రాఫ్టులో ప్రతిపాదించిన వేతనాలను కూడా రెండు కేటగిరీలకు (అన్‌స్కిల్డ్, సెమిస్కిల్డ్) తగ్గించారు. ఎంతో కాలంగా కాంట్రాక్టు కార్మికులు కోరుతున్న విడిఎను విస్మరించారు. అసంఘటితరంగ కార్మికుల క్షేమం కోసం పని చేస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్- టిఆర్ఎస్ ప్రభుత్వం అందులో భాగమైన కాంట్రాక్టు కార్మికులను మోసం చేయడం క్షమించరానిది.

గత పద్ధతులను తుంగలో తొక్కారు

గత 25 సంవత్సరాల నుండి కాంట్రాక్టు కార్మికుల వేతన సవరణను పరిశీలిస్తే వేతన సవరణ జరిగిన ప్రతిసారి డి.ఏ. న్యూట్రలైజేషన్ చేసి దానికి 5శాతం వెయిటేజి ఇచ్చేవారు. లేదా అప్పుడున్న వేతనంపై 50శాతం పెంచేవారు. ఈ రెండు పద్ధతులను ఇప్పుడు చేసిన వేతన సవరణలో పాటించలేదు. ఇతర అసంఘటిత రంగ కార్మికుల కనీసవేతనం నిర్ణయించేటప్పుడు 10-15 శాతం వెయిటేజీ ఇస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతన నిర్ణయంలో దీన్ని కూడా విస్మరించారు.

యాజమాన్యాల తొత్తు

మన రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే (ఉత్తరాంచల్,హర్యానా,రాజస్థాన్,హిమాచల్ ప్రదేశ్, చండిఘర్, పంజాబ్ ఇప్పటికే యాజమాన్యాలు భరించలేని స్థాయిలో ఉన్నాయట. డ్రాఫ్టులో ప్రతిపాదించిన విధంగా పెంచితే పరిశ్రమలు నడపమని యాజమాన్య సంఘాల ప్రతినిధులు చెప్పారు. ఇంకేముంది డ్రాఫ్టు కంటే వేతనాలు తగ్గించి నిర్ణయించారు. కానీ ఇదే డ్రాఫ్టుపై కార్మిక సంఘాలు అభ్యంతరాలు తెలిపి వేతనాలు పెంచాలని కోరాయి. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు అధికంగా ఉన్నాయి. వీటినెందుకు పరిగణనలోకి తీసుకోలేదు. దీనితో యజమానుల అనుకూలమైన ప్రభుత్వం అనిరుజువైంది.

ఎన్నికల ముందు కాంగ్రెస్- టిఆర్ఎస్ నాయకులు అసంఘటితరంగ కార్మికుల హక్కులు, సౌకర్యాలు కాపాడుతామని వాగ్దానాలు వరదపారించారు. అధికారం వచ్చాక మాత్రం కాంట్రాక్టు కార్మికుల బ్రతుకులను గాలికి వదిలారు.

■ **ఎరవెల్లి ముత్యంరావు,** రాష్ట్ర కార్యదర్శి,
ఎ.పి.కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)

మార్చి 6 - 12 వరకు "నిరసనవారం" పాటించండి

కేంద్రంలో యు.పి.ఎ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా కార్మికవర్గానికి అనుకూలమైన విధానాలు చేపట్టడంలో తాత్సారం చేస్తోంది. మనదేశ ప్రయోజనాలకు నష్టం కలిగే విధానాలను చేపడుతోంది. బహుళజాతి సంస్థల అనుకూల విధానాలను, ప్రపంచ బ్యాంకు విధానాలను కొనసాగిస్తోంది. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం దేశ వ్యాప్త ఆందోళనకు, దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని 3.2.2005న ఢిల్లీలో ఎఐటియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్, ఎఐసిసిటియు, యుటియుసి-ఎల్ఎస్ యుటియుసి మరియు టివిసిసి వగైరా కేంద్ర కార్మిక సంఘాల సమావేశం నిర్ణయించింది.

రాష్ట్రంలో కార్యాచరణ:

సిఐటియు, ఏఐటియుసి, హెచ్‌యంఎస్ ప్రతినిధులు 27.2.05న హైదరాబాదులో సమావేశమై క్రింది కార్యాచరణను రూపొందించాయి.

మార్చి 6న కరపత్రాల పంపిణీ,
మార్చి 7న బ్యాడ్జీల ధారణ,
మార్చి 8న గేట్ మీటింగ్స్,
మార్చి 9న దిష్టిబొమ్మల దగ్ధం,
మార్చి 10న అధికారులకు సామూహిక అర్జీల సమర్పణ,
మార్చి 11న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు- ర్యాలీలు,
మార్చి 12న పట్టణ-పారిశ్రామిక ప్రాంతాల సదస్సులు

భూ బకాసురుల భూమి కక్కిస్తున్న దళితులు



కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామంలో బోల్లా సోదరులైన రవి, రాధాకృష్ణ లకు తండ్రి సంపాదించిన 20 ఎకరాల భూమి మాత్రమే ఉండేది. దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములు, ఇండ్ల స్థలాలు, మహిళల బహిర్భూమి, రోడ్లు, పంట కాలువలు, మురుగు కాలువలు చివరకు స్మశాన భూములను సైతం దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు.

కంటికి నచ్చిన ప్రతిమహిళ జీవితం బుగ్గిపాలు కావాల్సిందే. నైటీ వేసుకున్నందుకు రజక మహిళపై దాడి చేశారు. చెరువు కట్టలు, రోడ్లపై మేక, పశువు, మనిషి ఏవరు నడిచినా దాడులతో పాటు, జరిమాన కట్టాలి. గ్రామ దళిత సర్పంచ్‌నిసైతం 3సార్లు కోట్టారు. ఏమి చేయలేక దళిత సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నాడు.

★★★

ఇండ్ల మధ్య చెరువు తవ్వి దళిత బాలుడు సురేష్ బాబును బలిగొనడంతో ఇంతకాలం అణిగిమణిగి ఉంటూ అన్ని అవమానాలు, భరించిన దళితుల్లో బాలుడి శవాన్ని చూసి ఆగ్రహం కట్టలు తెంచుకొన్నది. దళిత మహిళలు కెవిపియస్ అండతో కొంగు నడుం చుట్టి కారంపొడి చేతపట్టి న్యాయం కోసం నడి రోడ్డులో బైటాయించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో 11 గం॥లు రహదారిని స్థంభింప చేశారు. కలెక్టర్ జోక్యంతో భూస్వామి బోల్లారవిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇది బండ్లగూడెం దళితులు భూస్వాములపై పోరాడి సాధించిన తొలి విజయం.

భూస్వాములు ఆక్రమించిన చెరువులను 3 రోజులో పూడ్చి వేస్తామని అధికారులు ఇచ్చిన హామీలు 5 రోజులైనా అమలు చేయక పోవడంతో పెద్దతుమ్మడి వైవాక తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది దళితులు ఆఫీసును ముట్టడించారు. ప్రోక్లెయిన్‌ను తెప్పించి 24 గం॥లలో ఆ చెరువులను పూడ్చివేశారు.

తండ్రి చేసిన 2వేల అప్పు కోసం కూతురు శిరోమణిని హైదరాబాద్‌లోని తన కాంప్లెక్స్‌లో బంధించి అత్యాచారం జరిపిన భూస్వామి బోల్లా రవిపై ఎస్సీ, ఎస్టీ ఆత్యాచారాల నిరోధక చట్టం క్రింద కేసు నమోదు చేసేందుకు పోలీసుస్టేషన్ ముట్టడించారు. రాత్రి10 గంటల వరకు బైటాయించి అక్కడే వంటలు చేసుకునేందుకు సిద్ధం కావటంతో భూస్వామిపై కేసు నమోదు చేశారు.

ఈ గ్రామాల దళితుల పోరాటానికి సంఘీభావంగా దళితులంతా కదిలరావాలని కెవిపియస్ ఇచ్చిన పిలుపుమేరకు బంటుమిల్లి, ముదినేపల్లి, కృత్తివెన్న తదితర మండలాల నుండి వేలాది మంది తరలివచ్చారు. భూస్వామి బోల్లా రవిని అరెస్టు చేసి జైలుకు పంపారు.

వైవాక దళితులకు ఎస్సీ కార్పోరేషన్ ఇచ్చిన భూములపై అధికారులు సర్వేలు చేసి హద్దులు పాతగా మొత్తం 40 ఎకరాల భూమిని పెద్దతుమిడి, వైవాక దళితులు కెవిపియస్ జెండాలు పాతి స్వాధీనం చేసుకున్నారు.

★★★

పెదతుమ్మిడి గ్రామ దళిత సర్పంచ్ ఆత్మహత్యకు కారకుడైన భూస్వామి బోల్లా రాధాకృష్ణపై భూ ఆక్రమణ కేసుతో పాటు అవినీతి, ఎస్సీ,ఎస్టీ ఆత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని డియస్పీని దళిత మహిళలు బండ్లగూడెంలో 3 గంటలు నిర్బంధించారు.

కెవిపియస్ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కమీషన్ భూములను, చెరువులను స్వయంగా పరిశీలించారు. భూఆక్రమణలకు సహాకరించిన బంటుమిల్లి ఎం.ఆర్.ఓ., పెదతుమ్మిడి, వైవాక, రామవరపు మోడి గ్రామాల సహాయ కార్యదర్శులను సస్పెండ్ చేస్తునట్లు జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ ప్రకటించారు.

ఈ సమస్యపై సంఘం రాష్ట్ర అధక్ష్యులు పాటూరు రామయ్య అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీశారు. 236 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని నివేదిక అందిందని వీటిని పంపిణీ చేసేందుకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్ హామీ ఇచ్చారు.

ఇన్నాళ్ళు బీడు పడిన పొలాల్లో సంఘం అండతో పంటలు వేసుకున్నారు. అప్పుల బలవంతపు వసూలు ఆగిపోయాయి. కొంత మంది బాధితులను సంఘం వరకు వెళ్ళ వద్దని ఇవ్వలసిన డబ్బు, వారి భూములను కొంత మంది తిరిగి ఇచ్చేశారు. దళితుల చెరువుల లీజుదారులు కొందరు చెరువులను వదలి వెళ్లి పోయారు. గ్రామాలు వదిలి వెళ్లిన వారు తిరిగి రావడం ప్రారంభమైంది. భూస్వాముల ఆక్రమణలో ఉన్న దళితుల భూములు, ప్రభుత్వ భూములన్నింటిని తిరిగి దళితులకు, పేదలకు పంపిణీ చేసేంత వరకు ఈ పోరాటం కొనసాగుతుంది.

■ *గంగాధర్,*
కె.వి.పి.ఎస్. రాష్ట్ర నాయకులు

❑ మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

శ్రామిక మహిళ

ఎందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం?

మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమీపి స్తోందంటే చాలు, చాల చోట్ల ఒక ప్రశ్న వినిపిస్తూ ఉంటుంది. ఎందుకు మహిళలకే ప్రత్యేకించి ఒకరోజును కేటాయించాలి? వారు అన్నిట్లోను సమానత్వాన్ని కోరుతున్నారు కదా? మరి ఈ ప్రత్యేక దినాలు, ఉత్సవాలు దేనికట అని ఎంతో మంది పురుషులు, అక్కడక్క డా స్త్రీలు అడగటం పరిపాటి. వారి ప్రశ్న సరే, మరి ఈ ఉత్సవాలను ఉత్సాహంతో జరుపుకునే వారందరికీ దీని కారణం తెలియాలికదా!

95 సంవత్సరాలకు పూర్వం ప్రపంచ వ్యాప్తంగా మహిళల సమానత్వం గురించి, వారు పురుషులతో సమానంగా ప్రభుత్వంలో పాలుపంచుకోవటం గురించి వేడి వాడి చర్చలు నడుస్తున్న రోజులవి. అన్ని పెట్టుబడిదారీ దేశాల్లో కార్మికవర్గం మహిళల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారు. కాని మహిళలకు ఎటువంటి హక్కులు ఇవ్వటానికి పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ససేమిరా అన్నాయి. మహిళలకు కనీసం ఓటు హక్కు కూడా ఉండేది కాదు. అందువల్ల కార్మికవర్గం డిమాండ్లలో 'మహిళలకు ఓటుహక్కు' ప్రధానమైనదిగా మారింది. ఉత్తర అమెరికాలోని సోషలిస్టుల నాయకత్వంలో 1909, ఫిబ్రవరి 28న శ్రామిక మహిళలకు రాజకీయ హక్కు కావాలంటూ బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించారు. ఆరోజే ప్రపంచంలో మొట్టమొదటిసారిగా జరుపుకోబడినది 'మహిళా దినోత్సవం'. అందువల్ల మొదటి మహిళా దినోత్సవం జరుపుతున్న ఘనత అమెరికా మహిళలకు దక్కుతుంది.

1910లో జరిగిన రెండవ అంతర్జాతీయ శ్రామిక మహిళా మహాసభలో క్లారా జట్కిన్, ఆనాటి విప్లవకారిణి, అంతర్జాతీయంగా మహిళా దినోత్సవం జరపటానికిగాను ఒక తీర్మానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. అంతేకాదు ప్రతి సంవత్సరం, ప్రపంచమంతటా, ఒకే రోజున, మహిళా దినోత్స వాన్ని జరపాలి. "మహిళల ఓటు హక్కు సోషలిజం కోసం చేసే పోరాటాన్ని మరింత శక్తివంతం చేస్తుంది" అనే నినాదంతో అంతర్జా తీయ మహిళా దినోత్సవం జరపాలని మహాసభ నిర్ణయించింది.

మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు కూడా రష్యాలో తప్ప ఇతర దేశాల్లో కార్మికులకు ఓటు హక్కు ఉండేది. ఒక్క మహిళలు మాత్రమే దానికి దూరంగా ఉంచబడ్డారు.

ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా మహిళలు కూడా ఉత్పత్తిలో భాగస్వాములు కావలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి సంవత్సరం క్రమంగా మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఫ్యాక్టరీలలో, వర్కుషాపుల్లో, ఇళ్ళలోను, స్వీపర్లుగాను ఎక్కడ బడితే అక్కడ పని చేయాల్సి వచ్చేది. పురుషులతో సమానంగా చేయి కలిపి దేశ సంపదను పెంచటంలో మహిళలు తమ సత్తా చాటుకున్నారు. కాని ఓటు హక్కు మాత్రం వారికి తీరని కోరికగానే మిగిలింది.

యుద్ధం చివరి రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీ తంగా పెరిగాయి. ఈ పెరుగుదల ఇళ్ళలో ప్రశాంతంగా జీవితం గడుపుతున్న గృహిణులను కూడ వీధుల్లోకి వచ్చేటట్లు చేసింది. పెట్టుబడిదారీ ప్రభుత్వాల ఆర్థిక, రాజకీయ విధానాలను గృహిణులు కూడా ప్రశ్నించటం మొదలుపెట్టారు. క్రమంగా ఈ నిప్పురవ్వ జ్వాలగా మారి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలకు కూడా వ్యాపించింది.

దుకాణాల మీద, వర్తకుల మీద దాడి చేయటం వల్ల ఉపయోగం లేదని, ధరల పెరుగుదలకు ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని, కాబట్టి వాటిని నిలువరించాలని శ్రామిక మహిళలు కూడా గుర్తించారు. అందువల్ల ప్రభుత్వాన్ని మార్చటానికి తమకి కూడ ఓటు హక్కు కావాలని వారు విశ్వసించారు.

ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఓటు హక్కుకు సాధనంగా చేసుకోవాలని వారు భావించారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు సాగించి, దానిలో మంచి చెడులను సమీక్షించుకుని, శ్రామిక మహిళల ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవటానికి మహిళా దినోత్సవాన్ని ఒక మైలురాయిగా పెట్టుకున్నారు.

రెండవ అంతర్జాతీయ మహిళా మహాసభ తీర్మానం కాగితా లకే పరిమితమైపోలేదు. 1911లో అది కార్యరూపం దాల్చింది. అయితే మొట్టమొదటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 19, 1911న జరిగింది.

అన్ని దేశాల్లోను ఈ మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు మొదల య్యాయి. జర్మనీ, ఆస్ట్రేలియాల్లో అయితే జనవరిలోనే పనులు ప్రారంభించారు. పత్రికలు, కరపత్రాలు, మీటింగులు ఒకటేమిటి అన్ని రకాలుగాను ప్రచారం ముమ్మరం చేశారు. ఎక్కడ చూసిన సమాజంలోను, ప్రభుత్వంలోను మహిళల సమానత్వం మీదే చర్చ. మహిళలకు ఓటు హక్కు ఇవ్వటం ద్వారానే పార్లమెంటును మరింత ప్రజాస్వామికంగా నడపగలరని అన్ని పత్రికలూ ప్రచురించాయి.

1911, మార్చి 19న ప్రపంచమంతటా మహిళల సమావేశాలే. ముఖ్యంగా జర్మనీ, ఆస్ట్రేలియాలలో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా మహిళలు సమావేశమయ్యారు. ఏ మీటింగ్ హాల్ చూసిన క్రిక్కిరిసిన మహిళలే. వారికి చోటు కల్పించటం కోసం పురుషులు తమ జాగా సైతం వదులుకోవలసి వచ్చింది. ఇది మహిళల పోరాట పటిమను చాటింది. మహిళలు సమావేశాలకు హాజరైతే, పురుషులు ఇళ్ళలో ఉండి వారి పిల్లల ఆలనాపాలనా చేశారు. వారికి కూడా ఇది ఒక ఆనందాన్ని, మార్పుని కలిగించింది. 30వేల మందితో మహాప్రదర్శన జరిగింది. పోలీసులు లాఠీచార్జీ చేసి, బ్యానర్లు లాగేసి మహిళలను చెదరగొట్టటానికి ప్రయత్నించారు.

మిగతా 18వ పేజీలో

❑ సభలు-సమావేశాలు

మార్చి 15 నుంచి పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం మార్చి 15 నుంచి పోస్టల్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ (ఎన్ఎఫ్‌పిఇ), ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఎన్‌పిఓ), పోస్టల్, ఆర్ఎంఎస్, ఎంఎంఎస్, అడ్మినిస్ట్రేటివ్, పోస్టల్ అకౌంట్, గ్రామీణ్ డాక్ సేవక్‌లలో ఉన్న వీటి అనుబంధ యూనియన్లు ఈ నెల ఏడో తేదీన పోస్టల్ సెక్రటరీకి సమ్మె నోటీసును కూడా జారీ చేశాయి.

11 ప్రధాన డిమాండ్లు

గ్రామీణ్ డాక్ సేవక్‌లకు 50 శాతం డిఎను టైం రిలేటెడ్ కంటిన్యుటీ అలవెన్స్ (టిఆర్‌సిఏ)తో కలపాలి. మిగతా కేంద్రప్రభుత్వ ఉద్యోగులందరికీ దీనిని వర్తింపచేసి, పోస్టల్ అందునా గ్రామీణ్ డాక్ సేవక్(జిడిఎస్)లకు ఆ సౌకర్యాన్ని కల్పించకుండా ఉద్యోగుల్లో విభజనను ఏర్పరిచింది. దీనిని నివారించాలి. జిడిఎస్ యూనియన్‌కు ట్రేడ్ యూనియన్ గుర్తింపునివ్వాలి.

పోస్టల్ డిపార్ట్‌మెంట్లలో వివిధ సెక్షన్లలోని, వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను పెంచాలి. ఇందుకోసం 18.12.1998న డిపార్ట్‌మెంట్‌కు, యూనియన్లకు మధ్య జరిగిన ఒప్పందాన్ని అమలుపర్చాలి. ఫాస్ట్ ట్రాక్ ప్రమోషన్ స్కీంను రద్దు చేసి, ఎల్ఎస్‌జి, హెచ్ఎస్‌జి 1&2 ఉద్యోగులందరికీ నిబంధనావళికి అనుగుణంగా ప్రమోషన్లుకల్పించాలి.

ఐపిఓ యాక్ట్-1898, పిఒఎస్‌బి యాక్ట్-1873లను మార్చాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

పోస్టల్ ఉద్యోగులకు ఇప్పుడున్న ప్రమోషన్ పీరియడ్‌ను మార్చాలి. మానవ దృక్పథంతో ఎంపిక చేసిన వారిని ఇప్పటివరకు రిక్రూట్ చేసుకోలేదు. వీరందరికీ బాధ్యతలను అప్పగించాలి. పెండింగ్ పోస్టులన్నింటినీ రిక్రూట్ చేసుకోవాలి.

రిజర్వ్ ట్రైనింగ్ పూల్ (ఆర్‌టిపి) కింద శిక్షణ పొందిన అభ్యర్థులకు రెగ్యులర్ పోస్టింగులు ఇవ్వకుండా గంటలెక్కన వేతనాన్ని గణించి అందచేస్తున్నారు. 1981 నుంచి ఇప్పటివరకు ఇందులో శిక్షణ పొందిన వారందరికీ పోస్టింగులు ఇవ్వాలి.

పోస్టల్‌లో పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయడంతో పాటు, వారికి 50 ఏళ్లు నిండకమునుపే గ్రూప్-డి ఉద్యోగులుగా గుర్తించాలి. వారికి గ్రూప్-డి ఉద్యోగులకు వర్తిస్తున్న సౌకర్యాలన్నింటినీ అందచేయాలి.

పోస్టల్ ఇన్సూరెన్స్ ఖాతాలపై, అకౌంట్స్‌పై అదుపును వికేంద్రీకరించకూడదు. ఇవన్నీ హెచ్‌పిఓ పర్యవేక్షణలోనే ఉండాలి. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్టీరింగ్‌కమిటీ నుంచి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌ను వేరు చేయాలి.

ఈ డిపార్ట్‌మెంట్‌కు తగినన్ని నిధులు కేటాయించకపోవడం మూలాన 2002వ సంవత్సరం నుంచి ఓవర్‌టైం చేస్తున్న ఉద్యోగులు, అందుకు తగిన చెల్లింపులకు నోచుకోలేకపోతున్నారు.

ఈ డిమాండ్లు పరిష్కరించేంతవరకు సమ్మె నిరవధికంగా కొనసాగుతుందని యూనియన్లు హెచ్చరించాయి. ■

ఎన్.ఎఫ్.పి.ఇ. రాష్ట్ర కౌన్సిల్

గ్రూపు-సి మరియు ఇ.డి. ఉద్యోగుల రాష్ట్ర సంయుక్త కౌన్సిల్ సమావేశములు ఫిబ్రవరి 19,20తేదీలలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రములో బి.వి.రావు, వి.మోహనరావుల అధ్యక్షతన జరిగినవి. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్య కౌన్సిల్ సమావేశమును ప్రారంభించారు. తపాలా ఉద్యోగుల సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మయ్య, కె.ముత్యాలు, గ్రూపు-సి జాతీయ సంఘ ఉపాధ్యక్షులు ఆర్.శివన్నారాయణ, కార్మికలోకం పత్రికా సంపాదకులు వై.సిద్ధయ్య ప్రసంగించారు.

రాష్ట్రం నలుమూలల నుండి సుమారు 300 మంది ప్రతినిధు లు కౌన్సిల్ సమావేశానికి హాజరైనారు. తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు సమ్మె విరమించరాదని తీర్మానించి కేంద్ర జెఏసి కు పంపారు.

❑ లెటర్స్

శ్రామిక మహిళల పోరాటాల వార్తలను ప్రచురించాలి

"వాయిస్ ఆఫ్ వర్కింగ్ వుమెన్" పత్రికలో వస్తున్న కొన్ని ముఖ్య వార్తలు- వ్యాసాలు కార్మికలోకం పత్రికలో ప్రతినెల ప్రచురించాలని కోరుతున్నాము. శ్రామిక మహిళల సమస్యలు, పోరాటాలు కార్మికులందరికి (పత్రిక చదివిన వారి వరకైనా) అవగాహన కలుగుతుందని భావిస్తున్నాను. వాయిస్ పత్రిక కార్మికులందరికి వెళ్ళటం లేదు. తీసుకున్న వారిలో కూడా ఇంగ్లీష్ కనుక తొందరగా అర్థం చేసుకోవటానికి కష్టమౌతుంది. కొంత మంది మహిళలు కూడా ఇంగ్లీషు అర్థం చేసుకోలేం అని వాయిస్ పత్రిక తీసుకునే దానికి ఇష్టపడటం లేదు. కనుక ఈ విషయాన్ని పరిశీలించగలరని కోరుతున్నాను.

■ **పి. అరుణ,** శ్రామిక మహిళారంగం, శ్రీకాకుళం

సమకాలీన పరిస్థితులు- కార్మిక సంఘాల ప్రాధాన్యత

■ చిత్తబ్రత మజుందార్

పెట్టుబడిదారీ విధానం ప్రారంభం నుండి నిలదొక్కుకుని అభివృద్ధి చెందడానికి 'మార్కెట్' చోదకశక్తిగా వ్యవహరించింది. కార్మికులను దోపిడీ చేయడమే పెట్టుబడిదారీ విధానం సారాంశం. దోపిడీపై ఆధారపడి మార్కెట్ అభివృద్ధిని సాగించింది. దోపిడీ పెరిగేకొద్దీ మార్కెట్ కుంచించుకుపోతున్నది. ఉత్పత్తి సామర్థ్యం కంటే సరుకుల గిరాకీ తగ్గిపోయింది. పెట్టుబడిదారి వ్యవస్థ సమస్యలను పరిష్కరించుకుని అభివృద్ధి అయ్యే శక్తిని కోల్పోయింది. నిరంకుశ పోకడలు పెరిగి సామ్రాజ్యవాదంగా రూపొందింది. దీనితో మానవాళికే పెను ముప్పుగా ఏర్పడింది.

'పెట్టుబడి' తన వద్ద ఉన్న అపార సంపద, కండబలంతో సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి ఆధిపత్యాన్ని సాధించి సంక్షోభం నుండి బయటపడడానికి కార్మికవర్గంపై దాడి చేస్తున్నది.

పెట్టుబడిదారి విధానం పునరుద్ధరణ జరుగుతున్నట్లు లెక్కలలో గారడీ చేసి చూపుతున్నారు. ప్రపంచ వ్యాపితంగా కార్మికుల లో పెరుగుతున్న అసంతృప్తిని ఎలా దాయగలరు? 'మార్కెట్'లో జరిగిన ఆ కొద్దిపాటి అభివృద్ధి కూడా సంపన్నులకే దక్కింది. అవి పేదరికాన్ని రూపుమాపేందుకు కాని, పేదవాడికి కొంత ఉపశమనం కల్గించేందుకు గాని తోడ్పడలేదు. పెట్టుబడిదారీ విధానం పుంజు కుంటున్నదని చేస్తున్న ఆర్భాటపు ప్రచారాలు అంతా వట్టి బూటకమని అర్థం అయిపోతుంది. పరిశ్రమలు, సేవల రంగంలో లాభాలు తగ్గిపోవడం, కొత్త పెట్టుబడులు పెట్టే అవకాశాలు కుదించుకు పోవడంతో, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి లాభాపేక్షతో షేర్ల వ్యాపారం వైపు మొగ్గుచూపుతున్నది. గుత్త పెట్టుబడి ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం సాధించేందుకు మూడవ ప్రపంచ దేశాలపై తన ప్రపంచీకరణ ఎజెండాను గట్టిగా రుద్దడానికి పూనుకున్నది.

ప్రపంచ సంపదపై ఆధిపత్యం కోసం గుత్త పెట్టుబడి 'ప్రపంచీకరణ' విధానాన్ని రూపొందించింది. పరిశ్రమల మూసివేత, ప్రైవేటీకరణ, కార్మికుల జీవన విధానంపై దాడి, కార్మికుల సంఖ్యను తగ్గించడం, ఉద్యోగ అవకాశాలు లేకుండా చేయడం, కార్మిక హక్కులను కుదించటం లాంటివి ప్రపంచీకరణలో భాగమే. ప్రపంచీకరణ విధానాల ఫలితంగా జరిగే నష్టాల నుండి తమను తాము కాపాడుకునేందుకు కార్మికులు వాటిని వ్యతిరేకిస్తూ ప్రతిఘటనకు పూనుకున్నారు. 1991లో జరిగిన దేశవ్యాపిత సాధారణ సమ్మెతో అది మొదలై కార్మికవర్గం మరింత సంఘటిత మౌతున్నది. తన పై జరిగిన దాడులతోపాటు దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లే అంశాలపై కూడా కార్మికవర్గం పోరాడుతున్నది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా తీవ్రంగా నష్ట పోయిన కార్మికవర్గం, తనలాగే నష్టపోతున్న ఇతర కష్టజీవులను సంఘటిత పర్చడానికి కృషి చేసింది. ఈ ప్రతిఘటనను నిర్మిస్తున్నది కార్మికవర్గమే అని గుర్తించి, దెబ్బతీస్తే తప్ప ప్రపంచీకరణ కార్యక్రమం సాఫీగా సాగదనే నిర్ధారణకు గుత్తపెట్టుబడి వచ్చింది. పాలకవర్గాలలో అసహనం పెరిగింది. కొన్ని సందర్భాలలో విరోచిత పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కూడా రక్షించుకోవడం కష్టసాధ్యం అవుతున్నది.

కార్మికవర్గంపై జరుగుతున్న ప్రత్యక్ష దాడిని ఇప్పుడు సైద్ధాంతిక రంగానికి విస్తరింపచేశారనేది గుర్తించాలి. కార్మిక సంఘాలు ఇక ఏమాత్రం కార్మికుల సమస్యలు పరిష్కరించలేవని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. విదేశీ నిధులలో పుట్టగొడుగులు లాగా పుట్టుకువస్తున్న స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జిఓ)లు ఏవైతే వర్గ పోరాటాన్ని అంగీకరించవో అవే కార్మికుల రక్షణకులని ప్రచారం చేస్తున్నారు. ఈ విదేశీ నిధులను పెట్టుబడిదారీ వర్గం సమకూర్చు తున్నది. ట్రేడ్ యూనియన్‌లు కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలను నిర్మించి పోరాట పథంలో ముందుకు సాగుతున్నాయి. ట్రేడ్ యూనియన్‌లు తప్ప కార్మికుల ప్రయోజనాల గురించి ఇంకెవ్వరు పట్టించుకోరు. మార్క్స్-ఎంగిల్స్ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలోఇలా చెప్పారు.

"ఇంత వరకు ప్రతి సమాజ స్వరూపం పీడించే వర్గాలకు-పీడింపబడే వర్గాలకు మధ్య వైషమ్యం మీద ఆధారపడి ఉండేదని తెలుసుకున్నాం. కాని, ఏ వర్గమైనా మరొకవర్గాన్ని అణచి ఉంచాలంటే ఆ రెండవ వర్గం కనీసం తన బానిస బ్రతుకునైనా నిలబెట్టుకోగలిగి యుండాలి. ఆధునిక కార్మికవర్గం పరిశ్రమల అభివృద్ధితోపాటు అభివృద్ధి చెందడమనేది లేదు. అంతకంతకు హీనస్థితికి దిగజారవలసి వస్తుంది. కార్మికులు కార్మికులుగా బ్రతకడమే నేడు దుర్లభమవుతుంది. పెట్టుబడిదారివర్గం ఒక పాలకవర్గంగా పెత్తనం చేసే అర్హతను కోల్పోయింది. ఈ రోజున పెట్టుబడిదారీ వర్గానికి సమాజాన్ని పరిపాలించగల శక్తి ఎందువల్ల లేదంటే తన బానిసల్నే తాను పోషించలేని స్థితిలో అది పడింది. పెట్టుబడిదారీవర్గం యొక్క పెత్తనం క్రింద సమాజం ఇక జీవింప జాలదు. మరోవిధంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ వర్గం ఇక జీవించి యుండడమంటే అర్థం సమాజమే నాశనం కావడమన్నమాట."

పెట్టుబడిదారి విధానం అమలౌతున్న కాలంలో పెట్టుబడి దారివర్గం తన వ్యవస్థ దెబ్బతినకుండా పదిలంగా ఉండేందుకు సర్వశక్తులా ప్రయత్నిస్తుంది. అయితే కార్మికవర్గం ఈ వ్యవస్థనే దెబ్బతియ్యాలి. అది హక్కులను సాధించుకోవడానికైనా, ఈ వ్యవస్థనే కూకటివేళ్ళతో పెకిలించి వేయడానికైనా కావచ్చు. కార్మికవర్గానికి చివరి ఆయుధం సమ్మె. ఈ ఆయుధాన్ని కార్మికవర్గానికి లేకుండా చేయాలని పెట్టుబడిదారులు ప్రయత్నం చేస్తున్నారు.

ప్రపంచీకరణ యుగంలో కూడా ఎన్ని అవాంతరాలు ఎదురైనా కార్మికవర్గం తన అగ్రగామి పాత్రను నిర్వహించి ప్రతిచోట ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాటంలో ముందు పీఠీన ఉన్నది. చారిత్రకంగా చూసినా కార్మికవర్గ పోరాటం ఒక సరళరేఖలా ఎప్పుడు ముందుకు సాగలేదు. దాని పయనం ఎగుడుదిగుడుగానే సాగింది. ఒకానొక సమయంలో కొంత తగ్గినంత మాత్రన వెనకపట్టుపట్టినట్లు కాదు. కార్మిక సంఘాలకు కాలం చెల్లినట్లు కాదు. ఎట్టి పరిస్థితులలో నైనా అంతిమంగా తిరుగుబాటు బావుటాను కార్మికవర్గమే ఎగురవేసి మానవాళిని ఈ దోపిడి సమాజం నుండి విముక్తి చేస్తుంది.

సమకాలీన పరిస్థితులను గమనిస్తే గతంలోలాగే ట్రేడ్ యూని యన్‌ల ఆవశ్యకతను ధృవీకరిస్తున్నాయి. ట్రేడ్‌యూనియన్‌లు మరింత పట్టుదలతో కష్టజీవులను సమీకరించి వారిహక్కుల కోసం, ఈ దోపిడీ వ్యవస్థనే కూకటివేళ్ళతో పెకిలించి వేయడానికి కృషి చేయాలని కోరుతున్నాయి. ■

15వ పేజీ తరువాయి

రోడ్లపై రక్తాన్ని చిందించారు. ఆ తరువాత జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1913, మార్చి 8న జరిగింది. అప్పటి నుండి ఆ తేదీయే అంతర్జాతీయ మహిళ దినోత్సవంగా స్థిరపడిపోయింది.

ఈరోజు మనం ఓటు హక్కు, ఇతర ప్రాథమిక హక్కులనూ పొందగలిగామంటే కారణం ఆనాటి మన పూర్వుల ప్రేరణ, కార్యదీక్ష, దక్షతల ఫలితమే.

100ఏళ్ళ తర్వాత, నేటికీ మహిళలు ఇంకా అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. అసమానత, అధిక ధరలు, వేధింపులు, చీదరింపులు, వివక్షత, అసహాయత-ఇవన్నీ ఈరోజు మన ముందున్న ప్రశ్నలు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు నాటి పరిస్థితులను తలపింపచేస్తున్నాయి. మనకి హక్కులన్నీ, చట్టాలన్నీ పుస్తకాలలోనే ఉన్నాయి. వాటిని సామాన్య మహిళలకు అందుబాటులోకి తేవాలంటే మరిన్ని పోరాటాలు అనివార్యం.

మహిళా దినోత్సవాలంటే ఫ్యాషన్ పెరేడ్‌లు కాదు. వంటింటి చిట్కాలు, అప్పడాల కర్ర కార్టూన్‌లు కాదు. అవి మహిళల పోరాటాలను, ఐక్యతను, హక్కుల సాధనలో సమసిపోని దీక్షకు సంకేతాలు.

సమాన పనికి సమాన వేతనం, లైంగిక వేధింపుల వ్యతిరేక చట్టం, ఉద్యోగభద్రత, సామాజిక రక్షణ, సంఘంలో గౌరవం ఇవన్నీ మనం సాధించాలంటే శ్రామిక మహిళలందరూ కార్మికవర్గం చేపట్టే అన్ని పోరాటాల్లో ముందుండాలి. మరింత మేలైన, సుందరమైన సమాజాన్ని స్థాపించాలంటే మన వంతు కర్తవ్యాన్ని, భాగస్వామ్యాన్ని మనం నిర్వర్తించక తప్పదు.

"మహిళల భాగస్వామ్యం లేనిదే ఏ పోరాటం విజయవంతం కాజాలదు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు వంటింటికి మాత్రమే పరిమితం కారాదు. సంపద ఉత్పత్తిలో వారంతా భాగస్వాములైనపుడే ఏ సమాజమైనా పురోగతి సాధిస్తుంది"- లెనిన్.

ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా- మనలో మరింత స్ఫూర్తిని పట్టుదలను నింపుకోవటం కోసం ఈ మాటల్ని మనం మననం చేసుకుందాం. ■ **పద్మశ్రీ**

ఆదర్శ వనిత కా॥వశిష్ట్

హర్యానా రాష్ట్రంలో శ్రామిక మహిళల సమస్యలపైన, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పై పోరాడిన ఆదర్శ నాయకురాలు సరోజ్ వశిష్ట్ (30). ఈమె సిఐటియు హర్యానా రాష్ట్ర సిఐటియు కార్యదర్శిగా, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్, మరియు అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. అనేక పోరాటాలు నిర్వహించారు. ఉద్యోగుల కార్మికుల సమస్యలపై పోరాటంతో పాటు హర్యానా వంటి వెనుకబడిన రాష్ట్రంలో దురాచారాలకు, భూస్వామ్య విధానపు కట్టుబాట్లకు వ్యతిరేకంగా పలు ఉద్యమాలు నడిపారు. అతిచిన్న వయసులోనే గుర్తింపుగల నాయకురాలుగా ఎదిగారు. ఆమె భూస్వామ్య విధానంలోని బానిస కట్టుబాట్లకు పురుష ఆధిక్యతకు బలైపోయారు. 1999 సెప్టెంబర్ 24న సరోజ్ వశిష్ట్, ఆమె కుమార్తె విషాక (4సం॥) ఆమె భర్త చేతిలోనే దారుణహత్యకు గురయ్యారు.

భూస్వామ్య విధానపు దురాచారాలతోను, పురుషాధిక్య భావాలు కలిగిన అతను భార్య ఒక నాయకురాలుగా ఎదగటం సహించలేని కుత్సితబుద్ధితో ఈ దారుణానికి పాల్పడ్డాడు.

ఆమె మరణించినా హర్యానా రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యమానికి ఆమె వేసిన పునాది వల్ల ఈరోజు ఆ వుద్యమం దినదినాభివృద్ధి చెందుతున్నది. ఎన్ని కష్టాలు అనుభవించినా సమాజం మార్పుకోసం ఆమె చేసిన త్యాగం స్ఫూర్తిదాయకం. 57 సం॥ల స్వతంత్ర భారత చరిత్రలో ఇటువంటి వీరనారుల జ్ఞాపకాలు, వారి పోరాట స్ఫూర్తి మహిళలందరికీ ఆదర్శం కావాలి. నేడున్న పెట్టుబడిదారీ సమాజంలో వృత్తిపరంగా, సమాజపరంగా మహిళలపై ఉన్న వివక్షకు వ్యతిరేకంగా సమాన హక్కులు కోసం నేటి శ్రామిక మహిళలందరూ పోరుబాటలో నడవాలి. ■

ఇంటిపనివారల ధర్నా

హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా

ఇంటి పనివారలను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని కర్నూలు శాసనసభ్యులు ఎం.ఎ.గఫూర్, స్నేహ ఇంటిపనివారల సంఘం గౌరవాధ్యక్షురాలు పుణ్యవతి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద స్నేహ ఇంటి పనివారల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడుల్లో ఇంటి పనివారలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి స్వరూపరాణి, స్నేహ ఇంటిపనివారల సంఘం కన్వీనర్ టి.జ్యోతి ప్రసంగించారు. ఎస్.పుణ్యవతి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కార్మికశాఖ మంత్రి జి.వినోద్‌ను కలిసి చర్చించిన మీదట ఆయనే స్వయంగా ధర్నా శిబిరం వద్దకు వచ్చారు. ఇంటి పనివారల సంక్షేమం కోసం ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చట్టాలను అధ్యయనం చేసి వాటిని ఇక్కడ అమలు చేసేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇంటిపనివారలను సోషల్ సెక్యూరిటీ యాక్ట్ కిందకు తీసుకొస్తే కలిగే ప్రయోజనాలపై కూడా కూలంకుషంగా చర్చించి ఏప్రిల్15లోగా తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ■

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలతో ...

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ-ఆంధ్రప్రదేశ్

విశాఖపట్నం జిల్లా

స్త్రీ మరియు శిశు సంక్షేమ సంస్థ విశాఖపట్నం ద్వారా అమలు జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమముల వివరములు

విశాఖపట్నం జిల్లా నందు 20 ఐ.సి.డి.యస్. ప్రాజెక్టుల ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించుటకు తద్వారా శిశుమరణాలు, మాతృమరణాలు తగ్గించుటకుగాను కృషి చేయబడుచున్నది.

30, 766 మంది తల్లులు (గర్భిణీలు మరియు బాలింతలు) కు 1,17,721 మంది పిల్లలకు (6 నెలల నుండి 6 సం॥రంల లోపు) అనుబంధ పోషకాహారం సరఫరా చేయబడుతున్నది.

కిశోర బాలికలకు (11 సం॥ నుండి 17 సం॥రంల లోపు గుర్తించిన) :- జిల్లాలో 328 మందికి 1) కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు 2) బ్యూటీషియన్ కోర్సు 3) డి.టి.పి. 4) జెర్రిక్రాఫ్ట్ 5) హ్యాండీ క్రాఫ్ట్ 6) పర్సనల్ సెక్రటరీ 7) స్క్రీన్ ప్రింటింగ్ 8) లేసు మేకింగు 9) జ్యూట్ బ్యాగ్ మేకింగ్ 10) రెగ్సిన్ బ్యాగ్ మేకింగ్ 11) హోస్ మేకింగ్ 12) హ్యాండ్ ఎంబ్రాయిడరీ 13) ఫుట్‌వేర్ వంటి ట్రేడ్స్‌తో మహిళా ప్రగతి ప్రాంగణంలో ట్రెయినింగ్ యిప్పించుట ద్వారా వారిలో స్వయం ప్రతిపత్తి కల్పించడం జరుగుతున్నది.

బాలికా శిశు సంరక్షణా పథకం : 2004-2005 సం॥నకు గాను యిప్పటి వరకు 2614 మంది బాలికలకు బాలికా శిశు సంరక్షణా పథకం ద్వారా ఒక్కొక్కరికి 5000/- రూపాయలు చొప్పున మొత్తం రూ॥ 1,30,70,000/- బ్యాంకు నందు జమ చేయడమైనది.

బాలసదనములు : జిల్లాలో 5 బాల సదనాల ద్వారా 300 మంది (6 నుండి 15 సం॥ల లోపు) అనాధ మరియు పేద విద్యార్థులకు విద్యా, వసతి సౌకర్యం కల్పించడం జరుగుచున్నది.

ఉద్యోగినుల వసతి గృహములు : జిల్లా నందు 2 వసతి గృహముల ద్వారా 125 మంది ఉద్యోగినులకు వసతి కల్పించడం జరుగుచున్నది.

కుటుంబ నియంత్రణ పథకం అమలు : అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా 01.04.2004 నుండి 31.01.2005 వరకు 4746 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్స్ చేయించడం జరిగింది.

ఐ.సి.డి.ఎస్. ద్వారా 6 సేవలను అందించడం జరుగుచున్నది.

1) అనుబంధ పోషకాహారం 2) పూర్వ ప్రాథమిక విద్య 3) ఇమ్యూనైజేషన్
4) పోషణ ఆరోగ్య విద్య 5) ఆరోగ్య తనిఖీలు 6) రిఫరల్ సర్వీసెస్

నాలుగు (4) అంగన్‌వాడీ ట్రయినింగ్ సెంటర్ల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలో వివిధ అంశాలపై శిక్షణ యివ్వబడుచున్నది.

శిశు గృహ : దీని ద్వారా హాస్పిటల్స్ బహిరంగ ప్రదేశాల్లో వదిలి వెళ్ళిన అనాథ పిల్లలను చేరదీసి పిల్లలు లేని దంపతులకు, దత్తత యివ్వడం జరుగుచున్నది.

పొదుపు గ్రూపులు : స్వయం సిద్ధ పొదుపు గ్రూపుల ఏర్పాటు, నిర్వహణ భాద్యతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా జరుగుచున్నది.

ఇట్లు
ప్రాజెక్టు డైరెక్టరు
స్త్రీ, శిశు సంక్షేమ శాఖ
విశాఖపట్నం జిల్లా.



అనుమానప్పురుగు

ఆ రోజు మద్రాసు-పాట్నా ఎక్స్‌ప్రెస్ కాన్పూరు చేరేసరికి రాత్రి పది గంటలయింది. ఒక ముస్లిం జంట మా బోగీ లోకే ఎక్కింది. సైడు అప్పరు, లోవరు బెర్తులు వాళ్లవి. వచ్చి కూర్చున్నారు. ఒకే సూట్‌కేస్. పెద్ద సామాను లేదు. అతనికి ముప్ఫయి-ఆమెకు పాతిక ఉంటాయి. అతని గడ్డం బట్టి ముస్లిం అని చెప్పలేంగాని ఆమె బురఖాని బట్టి ఖచ్చితంగా పోల్చుకోగలిగాను.

'భాయ్‌సాబ్.. కహా జారహేహై'...అనడిగాను.

'లక్నో' ముక్తసరిగా జవాబు.

'మీరెక్కడికి?' అని అడుగుతాడనుకున్నాను. లేదు. వాళ్లలో వాళ్లే ఏదో ఉర్దూలో ఊసులాడుకుంటున్నారు. వాళ్లని చూస్తుంటే కన్నార్ప బుద్ధి కావడం లేదు. ఇక ఈ ఆలోచనలు అనవసరం అని కళ్లు మూసుకున్నాను. బండి ఊపుకి కాస్త కునుకు పట్టింది.

★★★

భయంకరమైన కల. అది కలో, నా ఆలోచనో, నా అనుమానమో ఇప్పటికీ తేల్చి చెప్పలేను. కాని నా నెత్తి మీద ఎవరో సమ్మెటతో కొట్టినట్టయ్యింది. ఒంట్లో రక్తమంతా చెమట రూపంలో బయటపడి నన్ను తడిపేసినట్టయింది.

రైల్లో ఉగ్రవాదులు బాంబు పెట్టారట. ఏ పెట్టెలో పెట్టారో తెలీదు. పోలీసులకు ఖచ్చితమైన సమాచారం అందింది. ఒక చిన్న స్టేషన్‌లో బండి ఆపి తనిఖీ ప్రారంభించారు. రైల్లో జనమంతా కిందికి దిగి పోయారు. కొందరు స్టేషన్‌కి దూరంగా పొలాల్లోకి పారిపోయారు. పిల్లల్ని తీసుకొని మేం కూడా ఉరికాం.

జనమంతా గుంపులు గుంపులుగా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. అంతా గొడవ గొడవ. రకరకాల భాషల్లో రకరకాల వ్యాఖ్యానాలు. ఏం జరుగుతోందో తెలియడం లేదు.

ఇంతలో ఢాం ఢాం అని బాంబు పేలిన శబ్దం.

అంతా పరుగులు- కేకలు- అరుపులు- తొక్కిసలాట.

కళ్లు తెరిచి చూసేసరికి నన్ను మా ఆవిడ గట్టిగా పట్టుకొని ఊపుతోంది.

★★★

'భాయ్‌సాబ్ క్యా హువా?' అంటూ పక్క సీట్లోని ముస్లిం యువకుడు ప్రశ్నిస్తున్నాడు.

నిద్దట్లో గట్టిగా అరవడం ప్రారంభించానట. పక్క బెర్తుల వాళ్లు నిద్రాభంగమై విసుక్కొంటున్నారు.

"ఏమిటీ దొంగలు పడ్డట్టు కలొచ్చిందా? ఏమ్మనిషో ఏమో. ఎలాగూ నిద్రపట్టదు గదా. గోతికాడ నక్కలాగా అలా కళ్లు తెరిచే కూర్చోండి. పడుకుంటే ఇలాగే ఏ పనికి మాలిన కలలో వచ్చి మా నిద్రను కూడా పాడుచేస్తాయి' అంటూ ఆవలిస్తూ మళ్లీ ముసుగు తన్నింది తను.

కళ్లు నులుముకొని తలదిండుగా పెట్టుకున్న తువ్వాలు తీసి చెమటలు పట్టిన ముఖాన్ని శుభ్రంగా తుడుచుకున్నాను. కిటికీ పక్క ముస్లిం అబ్బాయి, అమ్మాయి యింకా కింద బెర్తులోనే కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రాత్రి రెండయ్యింది.

అప్పుడు దూరింది నాలో ఒక అనుమానపు పురుగు- నాకొచ్చిన బాంబు కల నిజమైతే?

ఆ ఆలోచనే నా వెన్నెముకలో వణుకు పుట్టించింది.

గుజరాత్‌లో మత కల్లోలం మారణహోమం సాగించిన రోజులవి. గోధ్రా రైలు దుర్ఘటన తర్వాత గుజరాత్‌లో జరిగిన హింసాత్మక అల్లర్లు ఒక్కటొక్కటే గుర్తుకు రావడం ప్రారంభమైంది. గోధ్రా రైలు తగలబెట్టింది ఎవరో ఇంతవరకు నిర్ధారణ కాలేదు.

బహుశ ఈదేశంలో ముస్లిం అన్నవాడు ఎవ్వడూ ఎన్నటికీ మరచిపోలేని దారు ణ మారణహోమం అది. ప్రతీకార జ్వాల వాళ్లలో ఎప్పటికీ రగులుతూ నే ఉంటుంది. ఇక ఈ కాండ తరువాత ప్రతి ముసల్మాన్ యువకుడు హిందువులను హతమార్చడమే ధ్యేయంగా పెట్టుకుంటాడు కాబోలు.

ఎదురుగా కూర్చున్న ముస్లిం యువజంట మీద దృష్టి సారించాను. రెండు మూడు గంటల్లో తెల్లారబోతున్నా యింకా వీళ్లు పడుకోలేదు.

వాళ్లిద్దరి మీదా ఇక క్రమంగా అనుమానం ప్రబలడం మొదలైంది. ట్రైన్‌లో బాంబు పెట్టబోతున్నారు కాబోలు వీళ్లు. ఇలాంటివన్నీ తెల్లవారుజామున అంతా నిద్రలో ఉన్నప్పుడే చేస్తారు. అందుకే వీళ్లిద్దరూ పడుకోలేదు. అనుమానం పెనుభూతం అన్నారు. అనుమానం ఆందోళనగా మారింది. ఆందోళన ఘర్షణగా మారింది. నిద్రపోతున్నట్టే కళ్లు మూసుకొని దొంగచాటుగా వాళ్లని గమనించడం ప్రారంభించాను.

నా కెందుకో మా జీవితంలో అంతిమ ఘడియలు సమీపిస్తున్నా యనిపించింది. అంతకు ముందు అంత అందంగా కనిపించిన ఆ జంట ఏ అమాయక జింక కోసమో మాటువేసిన క్రూరమృగాల్లా

కనిపిస్తోంది.పక్కలో బాంబులు పెట్టుకొని ప్రయాణిస్తున్నామన్నమాట. గట్టిగా అరిచి అందరినీ లేపి బండి ఆపించాలని వుంది. కాని నా మాటలు నమ్మేది ఎవరు? నా అనుమానానికి ఏది నిదర్శనం?

ఇంతే కాబోలు.

ఈ దేశంలో ఒక హిందువు ఒక ముస్లింనీ, ఒక ముస్లిం ఒక హిందువునీ ఇలా పరస్పర అనుమాన జ్వాలల్లో దగ్ధం చేసుకుంటూ జీవనయాత్ర సాగించాలేమో.

ఉన్నట్టుండి ఆ కుర్రాడు లేచాడు. నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఇక టైమయింది కాబోలు. ఏదో ఆమె చెవిలో గొణిగి టాయ్‌లెట్స్ వైపు వెళ్లాడు. టాయ్‌లెట్‌లో బాంబు ఫిట్ చేస్తాడనుకుంటా. ఇక నా మెదడు నరాలు మొద్దుబారి పోవటం ప్రారంభించాయి. అందరి మాటా దేవుడెరుగు కనీసం నా పెళ్లాం పిల్లల్ని అయినా కాపాడుకుంటే అదే పదివేలనిపిస్తోంది.

అతను రాగానే కాళ్ల మీద పడి క్షమాభిక్ష పెట్టమని వేడుకుందామనుకున్నాను. గుజరాత్ పాపంలో నాకే భాగం లేదని అరిచి చెప్పాలనిపించింది.

గోధ్రా పాపంలో మాకూ ఏం భాగం లేదు. మరి ఎందుకు అంత మందిని పొట్టన బెట్టుకున్నారని అతను అడిగితే.

ఇదే... ఒకరి తరువాత ఒకరిని ఒక చైన్ రియాక్షన్‌లో చంపుకోవడమే ఇక మిగిలింది. పసి పిల్లల్నే కాదు. పుట్టబోయే పిల్లల్ని కూడా చంపగలిగే స్థాయికి ఎదగగలిగాం. ఈ రాక్షసత్వాన్ని ఏ రంగులతో చిత్రించగలం? ఈ క్రూరత్వాన్ని ఏ శబ్దాలతో వర్ణించగలం?

ఇలాంటి విషయాల్ని రాజకీయం చేస్తున్న వాళ్లని ప్రజలంతా నడివీధిలో నిలబెట్టే రోజు ఎప్పుడొస్తుందో?

ఆ కుర్రాడు తిరిగొచ్చాడు.

ముఖమంతా చెమటలు పట్టి ఉన్నాయి. ఆమె అప్పటికే సూట్‌కేస్ నుంచి తీసి టవల్ ఇచ్చింది. తుడుచుకొని కూర్చున్నాడు.

ఆమె అతన్ని చూసి నర్మగర్భంగా నవ్వింది. అతను ఆమె చేతులు మెత్తగా నొక్కి కళ్లతో ఏదో చెప్పాడు. ఇద్దరూ తప్పనిసరిగా ఐఎస్ఐ ఏజెంట్లు అయి ఉంటారు. మిలిటెంట్ క్యాంప్‌లో ఎన్నాళ్లు ట్రెనింగ్ తీసుకున్నారో కార్యదీక్ష వారిలో కదం తొక్కుతోంది.

కొంపదీసి వీళ్లిద్దరూ హ్యూమన్ బాంబులు కాదు కదా. ఏమో తీవ్రవాద సంస్థలలో పని చేస్తే వాళ్లలో మనిషితనం, మానవత్వం ఏ కోశానా వుండవు. నేను వాళ్ల కాళ్ల మీద పడితే మాత్రం వాళ్లు నన్ను వదిలేస్తారా? పైగా వాళ్లని గమనించినందుకు నన్ను సైలెంట్‌గా పైకి పంపించేస్తే.

ఒకసారి మిడిల్ బెర్తుల్లో పడుకున్న నా పిల్లల్ని చూసుకున్నాను. ప్రపంచంలో పదో వంతు జీవితాన్ని చూడకుండానే వాళ్ల కథ ఇలా విషాదంగా ముగియాలనుందా?

ఇందాక ఆమె సూట్‌కేస్ తెరచి దుప్పట్లు పైకి తీసినట్లుంది. అతను పై బెర్తుకి వెళ్లి ముసుగుతన్నాడు. ఇదేమిటి? నేను గమనిస్తున్నానని అనుమానం వచ్చి నిద్ర నటిస్తున్నారా? సూట్‌కేస్‌కు గొలుసేమీ వెయ్యకుండా కిందే వదిలేశారు. బాంబు అందులోనే ఉందేమో. నేను పడుకున్న తరువాత చల్లగా జారుకుందామని చూస్తున్నారా? కొంపదీసి మా పిల్లల్నిగాని ఎత్తుకు పోరుగదా.

లేచి నా బిడ్డల్ని తడిమి చూసుకున్నాను. మా అమ్మాయి నిద్దట్లో చిరునవ్వు చిందిస్తోంది. నాలో చెలరేగుతున్న ఈ తుఫాను తనకేమి పట్టనట్టు నా పిచ్చి పెళ్లాం హాయిగా గురకతీస్తోంది.

అయ్యో... బతికితే బాగుండు. ఈ ఒక్కరోజు ఎలాగో తెల్లారితే బాగుండు. మళ్లీ జీవితంలో రైలెక్కను. గ్యారంటీ. పోనీ చస్తే ఏమవుతుంది? చచ్చిపోదాం.

కాకపోతే ఒకటి. ఊరుగాని ఊళ్లో ఇలా చనిపోవాల్సి వచ్చిందే అని బాధ. శవాలను గుర్తించి ఇంటికి ఎవరైనా చేరుస్తారో లేదో. అమ్మా నాన్నకి తెలియజేయడానిక్కూడా అవకాశం లేదు. ఎవరి చావు ఎలా రాసిపెట్టి ఉందో ఎలా చెప్పగలం. నా అభిప్రాయాన్ని రికార్డు చెయ్యాలనిపించింది. ఏమైనా రాయాలనిపిస్తే రాయడానికి ఎప్పుడూ ఒక డైరీ పెట్టుకుంటాను.

కూర్చుని డైరీ తీసి రాయడానికి ఉపక్రమించాను. ఎదురుగా ఉన్న ఉగ్రవాద జంటను ఒకసారి చూశాను. ఏమీ తెలియనట్టు నంగనాచుల్లా పడుకున్నారు. రెండు తల్వార్లు, రెండు ఏకె 47లు, రెండు మానవ బాంబులు, రెండు క్రూరమృగాలు దుప్పట్లు కప్పుకొని వున్నట్టనిపించింది.

ముస్లిములారా! నేను హిందువుని. దయచేసి క్షమించండి.

హిందువులారా! నేను ముస్లింని. దయచేసి బతకనివ్వండి.

ఇలా డైరీలో ఏదేదో పిచ్చిపిచ్చిగా రాస్తూ నిద్రలోకి జారుకున్నాను.

★★★

'నాన్నా.. నాన్నా' అంటూ కదుపుతూ మా అబ్బాయి.

ఉలిక్కిపడి లేచాను. తెల్లగా తెల్లారింది. ఏదో ప్లాట్‌ఫాం. అంతా అయోమయంగా ఉంది. ఎదురుగా ముగ్గురూ మూడు విచిత్రమైన ముఖాలు పెట్టి నన్ను మరింత విచిత్రంగా చూస్తున్నారు.

'ఏ స్టేషన్'?

'లక్నో'

వెంటనే నా కళ్లు ఆ ఉగ్రవాద జంటను వెదికాయి. నా అంతర్మథనంతో వాళ్లకేం పని. దుప్పట్లు మడత పెట్టుకుని సూట్‌కేస్ సర్దుకుంటూ దిగడానికి సిద్ధపడుతున్నారు.

'భాయి సాబ్ జా రహే హై. ఆప్‌కే బచ్చే బహుత్ ప్యారే హై. అల్లా ఉస్‌కా భలా కరే' అంటూ వెళుతూ వెళుతూ వాళ్లు అన్న మాట నా గుండె ఫలకం మీద పదిలంగా రాసుకున్నాను.

ఎంత దారుణం.

నాలోనే ఒక హింస, ఒక ఉన్మాదం నా రక్తాన్ని మరిగించింది. ఒక అనుమానం నన్ను దగ్ధం చేసింది.

పశ్చాత్తాపంతో వళ్లంతా చలిజ్వరం వచ్చినట్లు గజగజ వణికిపోయింది. ముగ్గుర్నీ ఒకసారి కౌగలించుకున్నాను. రెండు కన్నీటి బొట్లు కనిపించకుండా మాయమైపోయాయి. సామానుతో పిల్లలతో ఇంటికి సురక్షితంగా చేరుకున్నాను. కానీ కోలుకోవడానికి మాత్రం చాలా రోజులు పట్టింది.

■ డా॥ప్రసాదమూర్తి

❑ పరిణామం

సలహాబోర్డులు న్యాయం చేస్తున్నాయా?

■ వి.శ్రీహరి

కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్, కార్మికుల శ్రేయస్సుకు ఏర్పర్చా మంటారు పాలకులు. ఏ కార్మికుడైనా ముందుగా కోరేది ఉద్యోగ భద్రత, సక్రమమైన జీతాలు, ఉద్యోగ విరమణ అనంతరం రక్షణ.

కార్మిక శ్రేయస్సుకోసం ఏర్పడినట్లు ప్రచారం చేసుకునే ఈ చట్టం పైన పేర్కొన్న ప్రయోజనాలను కార్మికులకు కలిగించడంలో జయప్రదమైందా? కాంట్రాక్ట్ ద్వారా కార్మికులను నియమించే విధానం అత్యంత హైన్యమైనది. దారుణమైన దోపిడీని కొనసాగించే విధానం అని బ్రిటిష్ ప్రభుత్వకాలం నుండి అనేక కమిటీలు, కమిషన్లు అభిప్రాయాపడ్డాయి. స్వాతంత్ర్యానంతరం ఈ విషయమై ఒక చట్టం చేసింది. 13ఏండ్ల స్వాతంత్ర్యం తరువాత అదీ 1967 ఎన్నికలలో పాలకవర్గాలలో సంక్షోభం ఏర్పడి, పాలకపక్షంగా వుండిన కాంగ్రెస్ అత్యధిక భారత ప్రజల విశ్వాసం కోల్పోయిన సమయంలో మాత్రమే.

ఈ చట్టం చెప్పేదేమిటి? కాంట్రాక్ట్ కార్మికుల నియామక విధానాన్ని పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాదు. కాబట్టి అలాంటి వారి శ్రేయస్సుకు కొన్ని చట్టబద్ధమైన రక్షణలు కల్పిస్తామని మాత్రమే. అయితే కొన్ని సందర్భాలలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్నే రద్దు చేసే అధికారం ప్రభుత్వం- అది కేంద్రమా, రాష్ట్రమా అనేది వేరు- తమ చేతుల్లోకి తీసుకున్నారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ లేబర్ విషయంలో తీసుకునే నిర్ణయాలపై తగు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సలహాబోర్డులను ఏర్పర్చాలని చట్టం చెబుతున్నది. అటు కేంద్రప్రభుత్వానికి సలహా ఇచ్చేందుకు, కేంద్రం, రాష్ట్రాలకు సలహా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి బోర్డులను ఏర్పర్చాలి.

ఆ విధంగా ఏర్పర్చే కమిటీలలో పరిశ్రమలకు, ప్రభుత్వానికి కార్మికవర్గానికి ప్రాతినిధ్య వుంటుంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పర్చే బోర్డ్‌లో 11 నుండి 17 మంది వరకు, రాష్ట్రాల బోర్డ్‌లో 9 నుండి 11 వరకు సభ్యులంటాయి. అంతేగాక ఒక ఛైర్మన్, లేబర్ కమిషనర్ అధికార హోదాలోనూ బోర్డులో సభ్యులుగా వుంటారు.

బోర్డ్‌ల నిర్మాణంలో గూడ కేంద్ర ప్రభుత్వం తన అత్తగారి పెత్తనం ప్రదర్శించింది. కార్మికుల పట్ల సవతితల్లి ప్రేమను ప్రకటించింది. కేంద్రప్రభుత్వం, రైల్వేలు, బొగ్గు పరిశ్రమ, గనుల శాఖకు ప్రాతినిధ్యం వుండాలి. కాంట్రాక్టర్, కార్మికుల ప్రతినిధులు వుంటారు. అంతేగాక ప్రయోజనం లేదా ఆసక్తి కలిగి వున్నారని కేంద్ర ప్రభుత్వం భావించిన ఇతరులను గూడ ఈ బోర్డుకు నియమించవచ్చు.

కాని రాష్ట్రప్రభుత్వం నియమించే బోర్డ్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమ ప్రతినిధులు, కార్మికుల ప్రతినిధులూ, ఆసక్తి కలిగి వుంటారని రాష్ట్ర ప్రభుత్వం భావించే ఇతరులు వుంటారు. అయితే సభ్యుల సంఖ్యలో ప్రధాన యజమానుల, కాంట్రాక్టర్లకు కలిపి ఎంతమంది ప్రాతినిధ్యం వహిస్తారో, అంతకన్నా తక్కువ మంది కాకుండా కార్మికుల ప్రతినిధులు వుండాలని చట్టం నిర్దేశిస్తున్నది.

(శాసనసభలో ప్రజాస్వామ్యం ఖూనీ చేశారంటూ గాంధీ బొమ్మ ముందు సత్యాగ్రహం చేసిన చంద్రబాబు నాయకత్వాన గల తెలుగుదేశం పార్టీ ఆయన ముఖ్యమంత్రిత్వంలో చేసిన నిర్వాకం, కార్మికుల కోసం చేసిన కృషిని తరువాత వివరంగా పరిశీలిద్దాం)

అంతకన్నా ముందు ఈ చట్టం చేసిన అన్యాయం చూద్దాం. యజమానుల కార్మికుల మధ్య చట్టబద్ధంగా తీర్పు పొందే లీగల్ అవకాశాలను, రాజకీయ అవకాశాలుగా తారుమారు చేస్తున్నది. ఈ చట్టాన్ని, దీని ప్రాధాన్యతను మనం ఒకవర్గంగా- కార్మికవర్గంగా ఆలోచించినప్పుడు మాత్రమే సక్రమంగా అర్థం చేసుకోగలం.

★★★

భారతదేశం ఒక దేశంగా స్వాతంత్ర్యం పొందింది. వలస పాలన రద్దు అయింది. భారతీయులే పాలకులైనారు. స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా ఆనాటికి ప్రముఖులుగా వున్నవారు ఆ స్వాతంత్య్రపు అర్థం వివరించారు. ప్రజలకు ఆర్థిక స్వాతంత్ర్యం వస్తేనే రాజకీయ స్వాతంత్ర్యం సుస్థిరమౌతుంది అని జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. మనదేశపు సామాజిక పునాది సామాజిక-ఆర్థిక రంగాలలో అసమానతలతో నిండివుంది. అలాంటి సమాజంలో వయోజన ఓటింగ్ ద్వారా తమ ప్రతినిధులను ఎన్నుకునే హక్కును సమానంగా ఇస్తున్నాం. అసమానతలతో నిండిన సామాజిక ఆర్థిక పునాది తొలగి, వాటిలోనూ సమానత ఏర్పడినప్పుడే వయోజన ఓటింగ్ ద్వారా సంక్రమించే రాజకీయ స్వాతంత్ర్యం అర్థవంతంగా రూపొంది సుస్థిరమౌతుంది అన్నారు అంబేద్కర్.

ఆనాటికి స్వాతంత్రోద్యమంలో పాల్గొని, త్యాగాలు చేయడం ప్రధానమైన అర్హతగా ప్రతినిధులను ఎన్నుకునేవారు భావించారు.

స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాట సమయంలో సహితం దేశాభివృద్ధికి బ్రిటిష్ పాలకులు కొల్లగొడుతున్న నిధులు, భారతదేశ పారిశ్రామికీకరణను అడ్డుకుంటున్న వారి విధానాలను నాయకత్వం ఖండించేది. ఒకసారి అధికారానికి వచ్చిన తరువాత దేశం పారిశ్రామిక వంతం అయితేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే వాదనతో మోత మోగించారు. అందుకు అనువుగా ప్రణాళికలు అన్నారు. పారిశ్రామికీకరణ ప్రధానంగా ప్రైవేట్ పెట్టుబడితో సాగాలన్నారు. ఈ దేశపు నడక ఈ 55 సంవత్సరాలుగా అలాగే సాగింది. ప్రైవేట్ పెట్టుబడి పారిశ్రామిక రంగంలో ఏర్పడేందుకు అవసరమైన పునాదులన్నీ ఏర్పాటు చేశారు. ఆర్థిక వనరులను అందించేందుకు కొత్త ఆర్థిక సంస్థలను ఏర్పాటు చేశారు. బ్యాంకులను జాతీయం చేసి నిధులు సమకూర్చారు.

దేశం పారిశ్రామిక వంతమైంది. కాని నిరుద్యోగం పోలేదు.

పారిశ్రామిక రంగం అంటే శ్రమజీవి, తను పొందే ప్రతిఫలమేగాక లాభాలు, మిగులు పేరుతో ఆయా యాజమాన్యాలకు దక్కే ఫలితాన్ని గూడ వుత్పత్తి చేస్తాడు. మొత్తం ఉత్పత్తిలో కార్మికుని భాగమెంత, యాజమాన్యపు భాగమెంత అనేది ఉత్పత్తి పైహక్కు కలిగిన రెండు విభాగాలు వున్నప్పుడు పొందడంలో పోటీ తప్పదు. అందులోనూ యజమాని ప్రైవేట్ పెట్టుబడిదారు అయినప్పుడు ఈపోటీ కర్కశంగా గూడ వుంటుంది. ఈ పోటీలో కర్కశత్వాన్ని తగ్గించేందుకే చట్టాలు చేస్తారు. చట్టాలు చేసే ప్రభుత్వం ప్రైవేట్ పెట్టుబడే పారిశ్రామికీకరణకు శరణ్యం అనుకున్నప్పుడు, ఆ చట్టాలు ఆ ప్రభుత్వాల ఆలోచనలకు అనుగుణ్యంగానే వుంటాయి.

తమ న్యాయమైన భాగం కోసం కార్మికులు సాగించే పోరాట తీవ్రతను, ఆనాటి సామాజిక- ఆర్థిక పరిస్థితులను బట్టి ప్రభుత్వాలు కార్మికవర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేయకతప్పని పరిస్థితికి నెట్టబడతాయి.

కాంట్రాక్టు కార్మికచట్టం ఏర్పడిన పూర్వరంగంలో ఆనాటి రాజకీయ పరిస్థితిని ముందే వివరించాము. పాలకవర్గంలో వచ్చిన సంక్షోభమే ఈ చట్టానికి ఆస్కారమిచ్చింది. తన ఇబ్బందుల నుండి చేసిన చట్టాన్ని ఆచరణలో నీరుగార్చాలని ప్రభుత్వం అనుకుంటుంది. అలాంటి అనుకూల పరిస్థితి ఏర్పడితే ఏ యజమానికి ఆ యజమాని దానిని నీరుగార్చే ప్రమాదం వుంది. ఆ ప్రమాదాన్ని పోరాటం ద్వారా ఎదుర్కొనలేని సందర్భంలో కార్మికవర్గం చట్టంలో వుండే హక్కులు అనుభవించేందుకు మరొక వేదికను వెతుక్కోక తప్పదు. పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా ఏర్పడిన కన్సిలియేషన్ యంత్రాంగం, లేబర్ కోర్టులు అలాంటి వేదికలు.

దీని అర్థమేమిటి? ఉత్పత్తిని పంచుకునే సందర్భంలో ప్రభుత్వము, యజమానులు కాక, చట్టబద్ధంగా వ్యవహరిస్తుందనే నమ్మకంతో మూడవ వేదికను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుండి గూడ న్యాయం జరగదనేగదా?

కాబట్టి మాటలకైనా నిష్పాక్షికంగా వ్యవహరిస్తుందనే ఈ వేదిక కాంట్రాక్టు విధానంలో నియామకం సరియైనదా, చట్టానికి అనుగుణ్యంగా వుందా అనే విషయాన్ని విచారించే 'గుడ్డిలో మెల్లగా వుండే' న్యాయవ్యవస్థ నుండి, ఆ విధానాన్ని కొనసాగించాలా రద్దు చేయాలా అనేది ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది.

ఇలా ప్రభుత్వమే నిర్ణయాధికారం తన చేతికి తీసుకొనడం మన దేశంలో మరింత ప్రమాదకరమైన విషయం.

భారతదేశంలో ఉపాధి కల్పనలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రభుత్వరంగందే- అటు ప్రభుత్వ శాఖలలో గాని, ప్రభుత్వ రంగ పరిశ్రమలలోగాని- పైచేయి. ప్రభుత్వ విధానాలే, యజమానిగా ప్రభుత్వం తన ఆధ్వర్యానగల పరిశ్రమలలో అమలు జరుపుతుంది.

గతంలో ప్రభుత్వం కొన్ని రంగాలలో ఉత్పత్తి, యాజమాన్యం తన చేతిలోనే వుండాలనుకున్నది. ప్రభుత్వ రంగాన్ని విస్తరించింది. పారిశ్రామిక రంగంలో ఉపాధి ఏర్పర్చింది. తమ పోరాటాల ద్వారా కార్మికవర్గగం తనకు అనుకూలమైన పని పరిస్థితులను ఏర్పర్చుకోగలిగింది. వాటి విజయాలతో ఉత్సాహపడి ప్రైవేట్ రంగంలో సంఘటిత కార్మికవర్గం సహితం వాటిలో కొన్నిటినైనా సాధించుకోగలిగింది.

1980ల నుండి ప్రభుత్వం ఆర్థిక రంగంలో సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. అ సంక్షోభ భారాలను కార్మికవర్గంపైన, ఇతర శ్రమజీవుల పైనా నెట్టాలనుకుంది. "21వ శతాబ్దంలోకి పయనం" అనే పేరిట ఉపాధి లేని పారిశ్రామికాభివృద్ధిని పోత్సహించింది. అంటే ఉత్పత్తికై పెట్టే పెట్టుబడిలో యంత్రాల భాగం పెంచింది. పెరిగిన సాంకేతిక నైపుణ్యంతో పని భారాలు పెరిగాయి. అంతేగాదు ప్రభుత్వ రంగం విస్తరణ ఆగింది. ఉన్న ప్రభుత్వ పరిశ్రమలు అసమర్థమైనవని ప్రచారం సాగించింది. వాటిని లాభదాయకంగా నడపాలంటే ఉద్యోగులను కుదించాలని చెప్పింది. శాశ్వత ఉద్యోగాలు తరిగిపోయాయి. కాని శ్రమశక్తి అవసరం కనుక అవుట్-సోర్సింగ్, కాంట్రాక్టు పని విధానం వంటివి పెరిగిపోయాయి.

కాంట్రాక్ట్ ఉద్యోగ విధానాన్ని తన యాజమాన్యంలోనే అనుమతించిన ప్రభుత్వం, ప్రైవేట్ రంగంలో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసేందుకు ఈ చట్టం ద్వారా వచ్చే హక్కును వినియోగిస్తుందా?

అయితే ఈ చట్టంలో సలహా బోర్డులు వున్నాయిగదా? వాటి ద్వారా కార్మికవర్గానికి న్యాయం జరగదా అని భ్రమపడే వారు వుండవచ్చు.

అలాంటి వారి కోసమే కేంద్ర సలహా బోర్డులో, రాష్ట్ర సలహా బోర్డులో ఎవరెవరికి ఎంత ప్రాతినిధ్యం వుండాలని పేర్కొన్నారో ఆ వివరాలను ఈ వ్యాసంలో పేర్కొన్నాం.

ఏ సలహా బోర్డులోగాని కార్మికవర్గ ప్రాతినిధ్యం నాల్గవ వంతు కన్నా తక్కువే వుంటుంది. ఆ కార్మిక ప్రతినిధులను గూడ ప్రభుత్వమే నామినేట్ చేస్తుంది. ఇక్కడే కార్మికవర్గంలో చీలికను ప్రభుత్వం చక్కగా వినియోగించుకుంటుంది. అధికారంలో వున్న పార్టీ అభిమానులకే ఈ ప్రాతినిధ్యం దక్కుతుంది.

ఇది కార్మికుల కందరికీ తెలిసిన బ్రహ్మరహస్యం.

అంతేగాదు ఈ సలహాబోర్డులు "సలహాలు" మాత్రమే ఇస్తాయి. తుది నిర్ణయం ప్రభుత్వానిదే.

అందువల్ల ఒకనొక చోట అమలవుతున్న కాంట్రాక్ట్ కార్మిక నియామక విధానం చట్టబద్ధమా? కాదా? అనే విషయం న్యాయపరమైన వివాదం కాదు. మధ్యవర్తి తీర్పుకాదు.

తప్పనిసరి పరిస్థితిలో చట్టం చేసిన ప్రభుత్వం, అమలును గూడ తన చేతిలోకి తీసుకొని ఈ విచారణను సహితం రాజకీయ పరం చేసింది. రాజకీయ విధానాలకు అనుగుణ్యంగా తుది నిర్ణయం వెలువడే వ్యవహారంగా మార్చివేసింది.

ఈ చట్టం వచ్చిన తరువాత "కాంట్రాక్ట్ విధానం రద్దు" అనే డిమాండ్ కోర్టు పరిధిలో లేదని, ప్రభుత్వ దయాదాక్షిణ్యాలే దిక్కని కోర్టులు తీర్పులు గూడ చెప్పాయి.

(మిగతా తరువాత వ్యాసాల్లో)

■

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలతో ...

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ-ఆంధ్రప్రదేశ్

విజయనగరం జిల్లా

స్త్రీ మరియు శిశు సంక్షేమ సంస్థ విజయనగరం ద్వారా జరుపబడుచున్న వివిధ అభివృద్ధి పథకములు

1. 2162 అంగన్‌వాడి కేంద్రములు మరియు 249 మిని అంగన్‌వాడి కేంద్రములు ద్వారా గర్భిణీలు, బాలింతలు మరియు 6 నెలలు నుండి 6 సంవత్సరములలోపు బాలబాలికలు, 1,27,429 మందికి అనుబంధ పోషకాహారమును 15 ఐసిడియస్ ప్రాజెక్టులు ద్వారా అందించుచున్నాము.
2. ప్రాంగణము ద్వారా 139 కిశోర బాలికలకు ఎంబ్రయిడరీ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్సు, కంప్యూటర్, డి.టి.పి. మరియు మల్టిపర్పస్ హెల్త్ వర్కర్సు (స్త్రీ) శిక్షణ ఇచ్చుచున్నాము.
3. ఐ.సి.డి.యస్. గంట్యాడ నందు స్వయం సిద్ధి పథకం ద్వారా 100 గ్రూపులను గుర్తించి పేదరిక నిర్మూలన స్వయం ఉపాధికొరకు రూ.14.5 లక్షలు మంజూరు చేసిరి. గ్రూపులు ద్వారా 8.06 లక్షలు పొదుపు చేయడమైనది.
4. ఐదు (5) కరువు మండలాలలో నడపబడుచున్న 333 అంగన్‌వాడి కేంద్రములు ద్వారా, కేంద్రమునకు 36 మంది చొప్పున 11,124 మంది అదనపు లబ్ధిదారులకు అదనపు పోషక ఆహారము ఇవ్వబడుచున్నది.
5. బాలిక సంరక్షణ పథకం ద్వారా 4473 మంది బాలికల లబ్ధికొరకు రూ. 223.65 లక్షలు 2004-05వ ఆర్థిక సంవత్సరములో మంజూరు చేసిరి. ఇందులో 1491 మంది లబ్ధిదారులకు రూ. 74,55,000/ - రెండు క్వార్టర్స్ బడ్జెట్ విడుదల చేసిరి.
6. జిల్లాలో గల 3 బాలసదనముల నందు 180 మంది బాలికలు, కాలేజియల్ హోమ్ నందు 30 మంది ఇన్‌మేట్స్‌కు ఉచిత భోజన మరియు వసతి కల్పన మరియు ఉద్యోగినుల వసతి గృహములో 40 మంది ఉద్యోగినులు లబ్ధిపొందుచున్నారు.
7. ఆరు (6) ఐ.సి.డి.యస్.ప్రాజెక్టులలో 57 బాలికా మండలాలు ఏర్పాటు.

బి.వెంకటేశ్వర రావు
జిల్లా కలెక్టర్

టి.స్వరాజ్యలక్ష్మి
పథక సంచాలకులు
జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ

ట్రేడ్ యూనియన్లను అనుమతించకపోతే బ్లాక్ లిస్టులో పెడతాం!

హెచ్చరించిన చైనా- దిగివచ్చిన అమెరికన్ కంపెనీ!

పెట్టుబడులు రావాలంటే కార్మిక చట్టాలు మారాలి!
పరిశ్రమలు రావాలంటే సంఘాలు ఉండకూడదు!
కార్మిక చట్టాలు అభివృద్ధికి గుదిబండగా ఉన్నాయి...

ఇలాంటి అనేక వ్యాఖ్యానాలు పెట్టుబడిదారులు, వారిని మోసే పత్రికలు రోజూ ప్రచారం చేస్తూనే ఉన్నాయి. చైనాలో జరిగిన సంఘటన వీరు వింటే మరి ఏమిటంటారో!?

వాల్ మార్ట్ స్టోర్స్ ఇంక్... అదో అమెరికన్ కంపెనీ... ప్రపంచంలోనే ఇదో పెద్ద కంపెనీ...15 బిలియన్ల డాలర్లుతో వ్యాపారం చేస్తున్న ఈ కంపెనీ సంఘాలు ఉండకూడదని వాదించిం ది. దీనికి చైనా అంగీకరించలేదు... తమ చట్టాలను గౌరవించి తీరాలని తేల్చి చెప్పింది. తమ యూనిట్లలో సంఘాలను అనుమతిం చకపోతే బ్లాకు లిస్టులో పెడతామని హెచ్చరించింది. దెబ్బకు దెయ్యం దిగింది. సంఘాలు పెట్టుకోవడానికి, కార్మిక హక్కులు కాపాడటానికి తాము కట్టుబడి ఉంటామని తెలియజేసింది. ఈ కంపెనీ ఒక్కటే కాదు.... జర్మనీకి చెందిన మెట్రో ఎ.జి., ఫ్రాన్స్‌కు చెందిన కెర్రిఫోర్ ఎస్.ఎ., బ్రిటన్‌కు చెందిన టెస్కో వంటి సంస్థలు చైనా కార్మిక సంఘాల చట్టాలను గౌరవిస్తామని, పాటిస్తామని ప్రకటించాయి.

విదేశీ కంపెనీలను ఈ విధంగా నిలదీసే దమ్ము మన పాలకులకుందా?

వినిమయ ధరల సూచిక

సెంటర్ సీరిస్ (బేస్ 1982=100)	నవంబర్2004	డిసెంబరు2004	లింకింగ్ ఫ్యాక్టర్ (1960=100)
ఆలిండియా	525	521	4.93
హైదరాబాద్	517	517	5.23
గుంటూరు	513	513	5.60
గూడూరు	501	500	4.33
విశాఖపట్నం	509	509	
వరంగల్	536	538	
కొత్తగూడెం	523	524	
రాష్ట్ర సీరిస్			
విజయనగరం	454	455	
రాజమండ్రి	507	507	
విజయవాడ	479	408	
ఆదోని	511	511	
ఎన్ఎస్‌బి కాంప్లెక్స్	501	503	
ఎంజిపి కాంప్లెక్స్	500	501	
ఎ.పి	-	-	

లింకింగ్ ఫ్యాక్టర్	1971=100	1960=100
విశాఖపట్నం	2.48	1.87
రాజమండ్రి	2.55	1.81
ఆదోని	2.33	1.88
వరంగల్	2.36	1.90
ఎన్ఎస్‌బి కాంప్లెక్స్	2.52	1.89
ఎ.పి	-	-

సమాచార వనరు : డైరెక్టరు ఆఫ్ ఎకనమిక్స్ & స్టాటిస్టిక్స్ - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జారీ చేసినది.
దీ లేబర్ బ్యూరో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా

తిరిగి పని సాధించుకున్న ముఠా కార్మికులు

1985 నుండి ప్రకాశం జిల్లా టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో 58 మంది పని చేస్తున్న ముఠా కార్మికులను కాంట్రాక్టరు మారాడనే సాకుతో తొలగించారు. ముఠా కార్మికులు 3రోజులు పొగాకు వేలం జరగకుండా ఆపుచేశారు. గుంటూరు వెళ్ళి పొగాకు బోర్డు చైర్మన్‌కు విన్నవించారు. కలెక్టరును, ఎసిఎల్‌ను సహాయం కోరారు. పలు నిరసన కార్యక్రమాలు చేశారు.

కార్మికులు ఐక్యంగా నిలబడటంతో పాత ముఠానే పని చేయునట్లుగా కాంట్రాక్టరు, బోర్డు అధికారులు అంగీకరించినారు.

కలెక్టరుకు జైలుశిక్ష

లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయనందుకు గుంటూరు జిల్లా కలెక్టరు మరియు షెడ్యూల్ కులాల సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల అరెస్టుకు ఆదేశిస్తూ గుంటూరు కార్మిక న్యాయస్థానం ఫిబ్రవరి 24 ఆదేశాలిచ్చింది. గుంటూరు జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంస్థలో కందే అబ్రహం ధర్మాజ్ఞాని దినసరి వేతనంపై 1986 జులై 11 నుండి పని చేస్తున్నాడు. 1990 జనవరి 31 వరకు అతను ఉద్యోగబాధ్యతలు నిర్వహించాడు. 1990 ఫిబ్రవరి 1న అతనిని అర్థంతరంగా విధులనుండి తొలగించారు. తనను ఎటువంటి కారణం లేకుండా విధుల నుండి తొలగించటాన్ని సవాలు చేస్తూ ఉద్యోగి గుంటూరు లేబర్ కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన లేబర్‌కోర్టు 2001 డిసెంబరు 13న తీర్పు జారీ చేస్తూ ఉద్యోగిని విధుల నుండి తొలగించటం చట్టరీత్యా చెల్లదని, అతనిని తొలగించిన నాటి నుండి అవార్డు ఇచ్చినరోజు వరకు అతను విధుల్లో ఉన్నట్లుగా పరిగణించి అతని జీతం బకాయిలు పూర్తిగా చెల్లించి, ఉద్యోగిని విధులలోకి తీసుకోవాలని తీర్పును ఇచ్చింది. ఉద్యోగి తను లేబర్ కోర్టులో వేసిన కేసులో గుంటూరు జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంస్థ ఛైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌ను, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లను ప్రతివాదులుగా చూపించారు. దీనిపై ప్రతివాదులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తాత్కాలికంగా లేబర్ కోర్టు తీర్పు మరియు అమలు పిటిషన్లపై స్టే ఇచ్చింది. ఇటీవల హైకోర్టులో స్టే రద్దు కావటంతో ప్రతివాదులు లేబర్‌కోర్టు ఎగ్జిక్యూషన్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయకపోవటంతో సంస్థ చైర్మన్ హోదాలో ఉన్న జిల్లా కలెక్టర్ మరియు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లపై నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తూ కార్మిక న్యాయస్థానం న్యాయమూర్తి పి.గుర్నాధరావు గురువారం ఆదేశాలిచ్చారు. ■

కార్మిక -కర్షక మైత్రికి సజీవ చిహ్నం వెనమణి 'కీల్‌వెన్మణి'

తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నం జిల్లాలో వెనమణి అనే చిన్న గ్రామం ఉన్నది. 1968 డిసెంబరు 25న ఆ గ్రామం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. గ్రామ భూస్వాములు అదే గ్రామానికి చెందిన 44 మంది దళిత వ్యవసాయ కూలీలను సజీవదహనం చేయడమే దానికి కారణం. ఈ 44 మందిని ఒక గుడిసెలో బంధించి సజీవదహనం చేశారు. అందులో మహిళలలు, వృద్ధులు, చిన్న పిల్లలూ ఉన్నారు. కూలీ పెంచమని అడిగినందుకే వారిని అంతం చేశారు.

ఆ ప్రాంతం పాత తంజాపూర్‌లోనిది. అది పోరాటాల గడ్డ. అక్కడ వ్యవసాయ కార్మికులు కూలీ, భూసంస్కరణలు, కుల వివక్షత లాంటి సమస్యలపై అనేక వీరోచిత పోరాటాలు చేసి విజయం సాధించిన చరిత్ర ఉన్నది. భూస్వాముల నిర్బంధాన్ని, దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. ఆర్థిక పోరాటాలతోపాటు సామాజిక సమస్యలను జతచేసి అక్కడ పోరాటాలు సాగినవి.

ఇప్పటి తంజాపూర్, తిరువారూర్, నాగపట్నం జిల్లాల వ్యవసాయ కార్మికులు, పేద ప్రజలు ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న వెనమణిలో అమరవీరుల స్థూపం వద్ద చేరి శ్రద్ధాంజలి తెలుపు కుంటారు. అమరవీరుల స్థూపం వద్ద ఉదయం జెండా ఆవిష్కరించి కార్యక్రమం ప్రారంభించి సాయంత్రం బహిరంగసభతో ముగుస్తుంది.

ఇటీవల పుట్టుకొచ్చిన దళిత సంఘాలలోని కొంత మంది స్వార్థపరులు ఎర్రజెండా పై దుష్ప్రచారానికి పూనుకుంటున్నారు. ఎర్రజెండా దళిత వ్యతిరేకమైనదని ప్రచారం చేస్తున్నారు. ఈ తరం వారికి అక్కడ భూస్వాముల దౌర్జన్యాల చరిత్ర దానిపై ఎర్రజెండా సాగించిన వీరోచిత పోరాటాల గురించి తెలియదనేది ఒక వాస్తవం. ఆ 3 జిల్లాల ప్రజల చైతన్యాన్ని పెంచేందుకు వెనమణీ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని సిఐటియు జాతాలను నిర్వహించాలని నిర్ణయించింది. సంఘటిత, అసంఘటిత, సేవా రంగాలలో పని చేస్తున్న మహిళలతో సహా 100 దళాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర, జిల్లా ఆఫీస్‌బేరర్స్ ఇందులో పాల్గొన్నారు. రవాణారంగం నుండి 24 దళాలు, విద్యుత్‌రంగం నుండి 16 దళాలు పాల్గొన్నాయి. 3500 గ్రామాలను కలుపుతూ 5000 కిలో మీటర్ల ప్రాంతంలో ఈ జాతాలు ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా 1940 నుండి 1968 వరకు జరిగిన వ్యవసాయ కార్మికుల పోరాట చరిత్రపై ఒక పుస్తకం విడుదల చేశారు.

సాగునీరు అడిగితే ఆరుగురిని పొట్టన పెట్టుకున్నారు.

రాజస్థాన్ రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న సాగునీటిని ప్రస్తుత బి.జె.పి. ప్రభుత్వం కోతపెట్టింది. అక్కడ రైతాంగం, వ్యవసాయ కార్మికులు ప్రతిఘటించారు. ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. అయినా ప్రతిఘటన కొనసాగింది. పోలీసు ఫైరింగ్ చేసి ముగ్గురిని పొట్టన పెట్టుకున్నది. అనేక మంది కాల్పులలో తీవ్రంగా గాయపడ్డారు. ఇది బి.జె.పి. ప్రభుత్వం యొక్క నిజరూపం.

ప్రతి వంద ఎకరాల సాగుభూమికి 5.23 క్యూసెక్కుల సాగునీరు ఇవ్వడానికి గత కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుత బి.జె.పి. ప్రభుత్వం కోత పెట్టి కేవలం 3.5 క్యూసెక్కుల నీరు విడుదలకు సిద్ధపడింది. ఈ నీరు పంటకు సరిపోవు. కావున 5.23 కుసెక్కుల నీరునే ఇవ్వాలని రైతాంగం కోరింది. ప్రభుత్వం నిరాకరించింది. అక్టోబరు 26న శ్రీ గంగానగర్ జిల్లాలోని ఘరసానా, రాలా, అనుపగ్రహలోని ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వేలాది మంది రైతాంగం ప్రదర్శనలు నిర్వహించారు. శాంతియుత ప్రదర్శనపై విచక్షణారహితంగా పోలీసు కాల్పులు జరిపి ముగ్గురిని పొట్టన పెట్టుకుంది. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. నిర్బంధం పెరిగిన కొద్ది ఉద్యమం విస్తృతరూపం తీసుకుంది. జిల్లా సరిహద్దులు దాటింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ హెతురాం బినివాల్ నాయకత్వంలో విశాలమైన పోరాట సమితి ఏర్పడింది. ప్రదర్శనలు, పికెటింగ్‌లు లాంటి వివిధ రూపాలలో ఉద్యమం కొనసాగింది. వేలాది మంది పోరాటాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 3న రైతాంగం, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో కదిలారు. ప్రభుత్వం కర్ఫ్యూను విధించింది. కర్ఫ్యూను ధిక్కరించి పోరాటం ముందుకు సాగింది. నిరంకుశమైన రాష్ట్ర బి.జె.పి. ప్రభుత్వం వందలాది మంది పోరాట సమితి కార్యకర్తలను అరెస్టు చేసింది.

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ హెతురాం బినివాల్‌ను జాతీయ భద్రతా చట్టం క్రింద అరెస్టు చేశారు. పోలీసు లాఠీచార్జీ చేసి ఫైరింగ్‌కు పూనుకున్నది. ఈ సంఘటనలో మరో ముగ్గురు చనిపోయారు. ప్రభుత్వం నిర్బంధాన్ని ఎన్ని విధాలా పెంచినా ఉద్యమం ముందుకే సాగింది.

దీనితో ప్రభుత్వం దిగివచ్చి మొత్తం డిమాండ్స్‌ను అంగీకరించింది. జాతీయ భద్రతా చట్టం ఇతర చట్టాల పేర అరెస్టు చేసిన వారిని విడుదల చేసింది. ఈ ఉద్యమం సందర్భంగా పోలీసుల పాత్ర పై విచారణకు త్రిసభ్య జూడిషియల్ కమిషన్‌ను ప్రభుత్వం ఉద్యమం ఒత్తిడి మేరకు నియమించాల్సి వచ్చింది.

రాజస్థాన్ రైతుల వీరోచిత పోరాటాన్ని సిఐటియు అభినందిస్తున్నది.

ఎఫ్‌డిఐ లు, ప్రైవేటీకరణల బండారం!

భారతదేశంలో బలమైన ప్రభుత్వరంగం ఉన్నది. టెలికాం, ఇన్సూరెన్స్, పెట్రోలియం, బ్యాంకులు లాంటి లాభదాయకమైన రంగాలలో ప్రభుత్వం గుత్తాధిపత్యం సాధించింది. వీటిని కాజేయాలని స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు దీర్ఘకాలంగా కుట్రలు పన్నుతున్నారు.

ఆ ప్రక్రియకు రెండు సాధనాలను ఏర్పాటు చేశారు. ఒక్కటి విదేశీ పెట్టుబడిని అనుమతించడం, రెండు ప్రభుత్వ రంగ సంస్థల నుండి పెట్టుబడుల ఉపసంహరణ.

విదేశీ పెట్టుబడి : విదేశీ పెట్టుబడులను అనుమతిస్తే ఆధునాతన సాంకేతిక విజ్ఞానము అందుబాటులోకి వస్తుందని, పెట్టుబడి పెరిగి ఉపాధి పెరుగుతుందని చెబుతున్నారు. మన వనరులు, సంపదపై విదేశీపెత్తనానికి తహతహలాడుతున్నారు. అభివృద్ధి చెందుతున్న మన దేశానికి విదేశీ పెట్టుబడి, టెక్నాలజీ అవసరం. అయితే ఏ రంగాలలో వినియోగించుకోవాలి అన్నదే ప్రశ్న. మనదేశ అభివృద్ధికి తోడ్పడే సాంకేతిక రంగాల్లో విదేశీ టెక్నాలజీని అనుమతించాలి. అయితే కొన్నేళ్ల తర్వాతనైనా అది మనకి బదిలీ అయ్యేట్లు చూసుకోవాలి. చైనా అనుభవం ఇదే. మనం పెట్టుబడి పెట్టలేని ఆధునిక పరిశ్రమల్లో, వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమలు పెట్టడానికి, ఉపాధి పెంపుకు ముందుకు వస్తే స్వాగతించవచ్చు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని టెలికం, ఇన్సూరెన్స్ రంగాలలో అనుమతించటానికి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది ప్రమాదకరం.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిధిని 26 నుండి 49శాతానికి ఇన్సూరెన్స్ రంగంలో పెంచుతూ ప్రతిపాదించారు. ఎల్‌ఐసి ఉద్యోగుల నుండి వచ్చిన ప్రతిఘటన దానికి వామపక్షాల మద్దతు పలకటంతో ప్రభుత్వం వెనుకడుగువేసింది. టెలికాం రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 49శాతం నుండి 74శాతానికి పెంచుతూ ప్రతిపాదించారు. అయితే ఈ రంగంలో ప్రతిఘటన తక్కువగా ఉన్నది. ఉద్యోగులు ప్రతిఘటన పెంచితే దానికి వామపక్షాల మద్దతు తోడై ఈ పెరుగుదలను ఇక్కడ కూడా నివారించవచ్చు.

★★★

పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వరంగ సంస్థలోని వాటాలను అమ్మగా వచ్చిన డబ్బుతో బడ్జెట్‌లోటు పూడ్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దానికి భిన్నంగా ఆచరణ వున్నది. దిగువ పట్టికను చూడగలరు.

సెంటూర్ హోటల్ (ముంబాయి) ప్రభుత్వరంగంలోనిది. బిజెపి ప్రభుత్వం 2002లో రూ.83కోట్లకు బాత్రా హాస్పిటాలీటీ అనే సంస్థకు అమ్మింది. వాళ్ళు సంవత్సరం తిరిగేలోపు సెంటూర్‌ను సహార గ్రూప్‌కు రూ.115 కోట్లకు అమ్మి రూ.32 కోట్లు వట్టి పుణ్యానికి సంపదించుకున్నారు.

అతి తక్కువ ధరలకు ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడమే కాకుండా కొనుగోలుదారుకు ఎదురు డబ్బును ఇచ్చి సంస్థను ఎలా పళ్ళెంలో పెట్టి ఉచితంగా అప్పగించారో అనేది దిగువ పట్టిక చూడగలరు.

సంస్థ పేరు	విలువ	అమ్మకం	కొత్త యజమాని	
1. బాల్కో	రూ.5500 కోట్లు	రూ.500కోట్లు	స్టెరిలైట్	రూ.250 కోట్లు విలువ చేసే విద్యుత్ ఉత్పాదనా కేంద్రం రూ. 200 కోట్లు సిమెంట్ నిలువలు. రూ.30కోట్లు మూసివేత అనంతరం సర్దుబాట్లుపేరు ప్రభుత్వం స్టెరిలైట్‌కు ఇచ్చింది.
2. విఎస్ఎన్ఎల్	విఎస్ఎన్ఎల్ నుండి టాటాలు 25% వాటాలను కేవలం రూ.1439 కోట్లుకు కొనుగోలు చేశారు. మార్కెట్ నుండి 20% వాటాలను రూ.1551కోట్లకు కొన్నారు. అంటే రూ.112 కోట్లు విలువ తక్కువ చేసి విఎస్ఎన్ఎల్ వాటాలను టాటాలకు ధారధత్తం చేసింది.		టాటా	25% వాటాలు కొన్నందుకే యాజమాన్యం అప్పగించారు. యాజమాన్యం అందుకున్న వెంటనే విఎస్ఎన్ఎల్ ఖాతా నుండి రూ.1200 కోట్లు టాటా టెలి సర్వీసుకు బదలాయించారు.
3. పారాదీప పాసఫైట్	రూ.250 కోట్లు	రూ.150కోట్లు	జువారీ మాదరాక్	"మూసివేత అనంతరం సర్దుబాట్లు" పేరుతో ప్రభుత్వం జూవారీలకు రూ.192 కోట్లు తిరిగిచ్చింది. అంటే కంపెనీకి ఉచితంగారూ.42కోట్లు బోనస్‌గాఇచ్చినట్లు.
4. జెస్సోప్	రూ.250 కోట్లు	రూ.18.18కోట్లు	రూయా గ్రూపు	కంపెనీ భూమి 5 ఎకరాలు అమ్ముకుంటే కొనుగోలు దారుకి రూ.14కోట్లు వచ్చింది. ముడిసరకు అమ్ముకుంటే రూ.11కోట్లు వచ్చింది. మొత్తం రూ.25కోట్లు. అంటే కంపెనీకి ఉచితంగా బోనస్ రూ.6 కోట్లు. ■

❑ జాతీయం

ఒక పక్క సి.ఎం.పి. కోసం కేటాయింపు పెంపు మరోపక్క సంస్కరణల బాట పయనం

పి. అజయ్‌కుమార్

అందరూ ఎదురు చూస్తున్న యుపిఎ ప్రభుత్వ కేంద్ర బడ్జెట్ 2005-06 రానే వచ్చింది. వామపక్ష పార్టీల ఒత్తిడి మేరకు సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించే కొన్ని చర్యలు ఈ బడ్జెట్‌లో ఉన్నాయి. అదే సామాన్య ప్రజానీకానికి హాని కలిగించే సంస్కరణలు కొనసాగింపు కూడా దీన్లో కనపడుతుంది. సంస్కరణల పట్టాల మీదనే బడ్జెట్ ఉందని పెట్టుబడిదారుల అసోసియేషన్లు సంతోష పడిపోవటం దీనికి రుజువుగా చెప్పవచ్చు. జాతీయ ఉపాధి హామీ పథకం, గ్రామీణ అభివృద్ధి, విద్య,ఆరోగ్య రంగాలకు 50వేల కోట్ల రూపాయల అదనపు నిధులు కేటాయించాలని వామపక్షాలు కోరాయి. ఇందులో కొంత మేరకే కేటాయింపులు పెరిగాయి.అయినప్పటికీ మొదటిసారిగా ఇంతమేర కయినా కేటాయింపులు జరగటం చూస్తున్నాం. ఉద్యోగులు, కార్మికు లు పెద్దగా సంతోషపడాల్సిన అంశాలు బడ్జెట్‌లో లేవనిపిస్తుంది.

కనీస ఉమ్మడి ప్రణాళికకు తగినంత కేటాయింపులు చేయకపోవటానికి సంపన్నవర్గాలపై పన్ను రాయితీలు ఉపసంహరించకపోవటం, పన్ను రేట్లను పెంచకపోవటం కారణం. పైగా కార్పొరేటు సంస్థల ఆదాయపన్ను 3శాతం తగ్గించారు. షేర్ బ్రోకర్ల లావాదేవాలపైన పన్నును గత సంవత్సరం 6వేల కోట్ల రూపాయలు తగ్గించిన ప్రభుత్వం ఈ సంవత్సరం కేవలం వెయ్యికోట్ల రూపాయలు మాత్రమే పెంచింది. విదేశీ మదుపు సంస్థలు తరలించుకు పోయే పెట్టుబడుల మీద పన్ను వేయాలన్న ప్రతిపాదనను కూడా పట్టించుకోలేదు. స్థూల జాతీయ ఉత్పత్తిలో పన్నుల వసూలు శాతం పెరగాలన్న సూచన కూడా నెరవేరలేదు.

కనీస ఉమ్మడి ప్రణాళికలోని వాగ్దానాలు నెరవేరటానికి ఈ క్రింది విధంగా కేటాయింపులు ఉన్నాయి. ఇవి చాలా తక్కువగా ఉన్నాయని చూస్తే తెలుస్తుంది.

	2004-05	**2005-06**
గ్రామీణ అభివృద్ధి	13885	18353
దీనిలో గ్రామీణ ఉపాధికి	4020	11000
విద్య	13228	18337
ఆరోగ్యం	8420	10280
వ్యవసాయం	3276	4559

సబ్సిడీలపై కోత పడుతుందని భావించినా యుపిఎ ప్రభుత్వం దానికి సాహసించలేక పోయింది. సబ్సిడీలు ఈక్రింది విధంగా ఉన్నాయి.

	2004-05	**2005-06**
ఎరువులు	15662	16254
ఆహారం	25800	26200
మొత్తం సబ్సిడీలు	46514	47432

ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితిని లక్ష రూపాయలకు పెంచటం, పన్నురేట్లు తగ్గించటం ఊరట కలిగించింది. పొదుపు పథకాలలో మదుపు చేసుకునే వీలుండే సెక్షన్లను ఎత్తివేసి లక్ష రూపాయల వరకు వివిధ పథకాల కింద పొదుపు చేసిన మొత్తాలకు పన్నుపడే ఆదాయం నుండి మినహాయింపు ఇచ్చారు. కానీ వీటి కాలపరిమితి ముగిసిన తరువాత వాపసు తీసుకునే సమయంలో పన్ను చెల్లించాలి. మహిళలకు, సీనియర్ సిటిజన్స్‌కు అదనంగా ఇచ్చిన పన్ను పరిమితులు ఆచరణలో అంతగా ఉపయోగపడవు. పెట్రోలియం ఉత్పత్తులపై ఎక్సైజు, కస్టమ్స్ సుంకాలను తగ్గించటం ప్రజలకు కొంత ఊరట కలిగిస్తుంది.

సంస్కరణలు యధాతథంగా కొనసాగే విధంగా బడ్జెట్ ఉంది. వాటిలో ముఖ్యమయిన ప్రతిపాదనలు ఈ క్రింది విధంగా వున్నాయి.

1. సహకార పరపతి రంగంలో సంస్కరణలు అమలు చేయాలన్న టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. మ్యాక్స్ చట్టం అమలు చేయాలని, సహకార బ్యాంకులు, సంఘాలను పునర్‌వ్యవస్థీకరించాలని కమిటీ సూచించింది. **2.** ప్రయివేటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లను అనుమతించేందుకు 'వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్' కమిటీ చట్టం సవరణ. **3.** 108 వస్తువులను చిన్నతరహా పరిశ్రమల రిజర్వుడు లిస్టు నుండి తొలగింపు **4.** మైనింగ్, చిల్లరవర్తకం, పెన్షన్ ఫండ్స్‌లోకి విదేశీ పెట్టుబడి అనుమతి. **5.** బ్యాంకింగ్ రంగ సంస్కరణలకు ఆమోదం. ప్రయివేటు బ్యాంకులలోకి 75శాతం విదేశీ పెట్టుబడి అనుమతికి ఆర్‌బిఐ సర్క్యులర్ జారీ. **6.** ఆహార ధాన్యాల సేకరణ వికేంద్రీకరణకు నాంది. ఫుడ్ కార్పొరేషన్ నిర్వీర్యం. **7.** ప్రభుత్వరంగ సంస్థల డిసిన్వెస్ట్‌మెంట్ నుండి వచ్చే నిధులు 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్'కు తరలింపు. ఈ ఫండ్ బడ్జెట్‌లో భాగంగా ఉండదు.కావున డిసిన్వెస్ట్‌మెంట్ టార్గెట్‌ను చూపించలేదు. **8.** విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల వల్ల మన దేశంలోని అనేక పంటలకు గిట్టుబాటు ధరలు రావటం లేదు. అటువంటి దిగుమతులపై సుంకాలు పెంచాలన్న సూచనను పట్టించుకోలేదు. **9.** వ్యవసాయేతర ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను 20 నుండి పది శాతానికి, కొన్ని వస్తువులపైన 5శాతానికి తగ్గించారు. 0మన పరిశ్రమల ఉత్పత్తులకు ఈ తగ్గింపు ప్రమాదం కల్గిస్తుంది. **10.** ద్రవ్య బాధ్యత బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఆర్‌బిఎం) చట్టం ప్రకారం ద్రవ్యలోటును 2005- 06లో తగ్గించలేక పోయినందుకు పార్లమెంటుకు వివరణ ఇచ్చారు. 2008-09 కల్లా ద్రవ్యలోటు, రెవెన్యూలోటు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే కాలంలో ప్రభుత్వ వ్యయం తగ్గేందుకు ఇది సూచిక. **11.** ఆదాయపన్ను విషయంలో కేల్కర్ కమిటీ సిఫార్సుల అమలు.

శ్రమజీవులను విస్మరించిన బడ్జెట్

పి. అజయ్‌కుమార్

రాష్ట్ర కాంగ్రెసు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి పూర్తి స్థాయి బడ్జెట్ కార్మికులకు, ఉద్యోగులకు నిరాశ మిగిల్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే విధంగా ఈ బడ్జెట్ లేదు. కార్మిక సంక్షేమం ఊసు కూడా లేకపోవటం ప్రశ్నార్థకంగా మారింది.

సాగునీటికి ప్రణాళికా కేటాయింపులు గణనీయంగా పెంచటం హర్షణీయం. కానీ దీని కోసం సామాజిక రంగాలకు కేటాయింపులు కత్తిరించటం ఆమోదయోగ్యం కాదు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే మొత్తం ప్రణాళికా ఖర్చులో సామాజిక సంక్షేమం వాటా తగ్గింది. ఇది బలహీన వర్గాలకు మొండి చెయ్యి చూపటమవుతుంది.

ద్రవ్యలోటును ఈ బడ్జెట్‌లో మరింత తగ్గించామని, రాబోయే ఒకటి, రెండు సంవత్సరాల్లో అసలు లేకుండా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచబ్యాంకును సంతృప్తి పరచటానికి ప్రభుత్వం ఈ పనికి పూనుకున్నది. ప్రజల ఉపాధి పెరుగుదల కోసం ప్రభుత్వ వ్యయం పెరగాలని, కొనుగోలు శక్తి పెంపుదలకు దారి తీస్తుందని వామపక్ష ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. అభివృద్ధికి ఇదే మార్గమంటున్నారు. ఈ సూచనను విస్మరించి ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి తద్వారా ద్రవ్యలోటు తగ్గించానికి పూనుకోవటం అత్యధిక ప్రజానీక ప్రయోజనాలకు హాని చేస్తుంది.

వేలాది కోట్ల రూపాయల పన్ను బకాయిలు (కమర్షియల్, ఎక్సైజ్ వగైరా) వసూలు చేయటం, కార్పొరేట్ కాలేజీలు, హాస్పిటల్స్, తదితర కొత్త తరహా సంపన్న వర్గాలపై పన్నులు వేయటం ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవచ్చు. దాని నుండి ప్రభుత్వ వ్యయం పెంచవచ్చు. ప్రభుత్వ విధానంలో భాగంగానే బడ్జెట్‌లో దీన్నిపై దృష్టి పెట్టలేదని చెప్పాలి. ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు అనేకం ఉన్నాయి. వాటిని సేకరించటంపై దృష్టి లేదు. వచ్చే కొద్ది ఆదాయం చూపించి దానికి మించి ఖర్చు పెరిగిపోతున్నదంటూ గగ్గోలు పెట్టటం, సామాజిక ఖర్చులు, సబ్సిడీలకు కోత పెట్టటం రివాజయింది. ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగే ద్రవ్యలోటు గురించే మాట్లాడుతున్నది.

కార్మికుల ఉపాధి పెరగటానికి మూతపడిన పరిశ్రమలు తెరిపిస్తామని ఎన్నికల సమయంలో ఇప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి వాగ్దానం చేశారు. కానీ ఈ బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదు. పారిశ్రామిక మౌలిక సౌకర్యాల అభివృద్ధి కోసం కేటాయించిన 100కో.రూ.లు మూతపడిన పరిశ్రమలకు ఉపయోగపడేది కాదు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న రెండున్నర లక్షల ఖాళీలను భర్తీ చేయటానికి కూడా ఈ బడ్జెట్ పూనుకోలేదు. ఈ ఖాళీలలో ఇప్పటికి 2,500 ఖాళీలను మాత్రమే భర్తీ చేశారు. కొత్త ఉపాధి కల్పించకపోగా ఎం.పి.ఇ.ఓ.లు, పిఎసిఎస్ ఉద్యోగులను ఉద్యోగాల నుండి ఈ ప్రభుత్వం ఊడగొడుతున్నది. ఇంటిరిం రిలీఫ్ 8.5శాతం మాత్రమే ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను అసంతృప్తికి గురిచేసింది. గ్రామసేవకుల, అంగన్‌వాడీ మహిళల వేతనాల పెంపుదల వాగ్దానం నెరవేర్చే కేటాయింపులు బడ్జెట్‌లో లేవు.

అసంఘటితరంగ కార్మికుల సంక్షేమం కోసం తేవాల్సిన బిల్లును బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. లక్షలాది మంది పేద కార్మికులు, కొత్త తెల్లకార్డుల కోసం అప్లికేషన్లు పెట్టుకున్నారు. బియ్యం సబ్సిడీని అందుకు తగిన విధంగా పెంచలేదు. అంటే కొత్త తెల్లకార్డులు ఇస్తారా లేదా అని అనుమానం వస్తుంది. పేద కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం బ్రాందీ షాపులను గ్రామాలకు కూడా విస్తరింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. తద్వారా 800 కో.రూ. అధిక ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో చూపించింది. గత టిడిపి ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా పేదల జేబులు కొట్టటానికి పూనుకుంది.

బడ్జెట్ మొత్తంగా చూస్తే ఒక్క సాగునీటి రంగంలో తప్ప మిగతా అన్ని రంగాల్లోనూ, గత ప్రభుత్వ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అనుసరించింది. ప్రపంచబ్యాంకు విధానాలను అనుసరించే దారిలో ప్రభుత్వం ఉందని బడ్జెట్‌ను పరిశీలిస్తే తేలుతుంది.

కొన్ని గణాంకాలు

మొత్తం ప్రణాళికా కేటాయింపులలో వివిధ పద్దుల వాటా

	2004-05	2005-06
నీటిపారుదల	27.41	36.03
రవాణా	4.02	2.98
ఆరోగ్యం	4.42	4.06
హౌసింగ్	2.84	1.98
ఎస్సీ, ఎస్టీ, బిసి,మైనారిటీ సంక్షేమం	8.68	8.27
సాంఘిక సంక్షేమం	3.13	2.84
కార్మిక, ఉపాధి	0.16	0.13

	03-04	04-05	05-06
రాష్ట్ర స్థూల ఆదాయంలో ద్రవ్యలోటు	4.19	3.78	3.72
రాష్ట్రస్థూల ఆదాయంలో రెవెన్యూలోటు	1.66	0.93	0.62
రాష్ట్ర స్వంత రెవెన్యూ ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు	64	57.99	56.70
మొత్తం రెవెన్యూ ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు	41.47	38.57	38.08

సినిమా

బుష్ యుద్ధోన్మాదాన్ని నగ్నంగా చూపించిన చిత్రం

ఫారెన్ హీట్ - 9/11

బుష్ నేతృత్వంలో అమెరికా సమాజం రోజురోజుకు చిత్రమవుతూ ఉన్నది. ఈ విషయాన్ని ఇటీవల ఇండియాలో విడుదలైన మైఖెల్‌మూర్ డాక్యుమెంటరీ చిత్రం 'ఫారన్ హీట్-9/11' రేఖా మాత్రంగా తెలియజేసింది.

2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లోనే అమెరికా అధ్యక్షునిగా జార్జిబుష్ అప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికయ్యాడని, బుష్ తమ అధ్యక్షుడు కానేకాడని, రోడ్ల పైకి జనం వచ్చి నిరసన తెలియజేయడంతో చిత్రం ప్రారంభమవుతుంది. ఆ తదుపరి ఎనిమిది నెలల కాలంలో బుష్ ప్రజాపాలనను పెద్దగా పట్టించుకోకుండా వెకేషన్ పేరుతో విశ్రాంతి జీవనం గడిపిన తీరును చూపెడుతుంది. అత్యున్నత పదవిలో ఉన్నవారు ప్రైవేటు జీవితం పేరుతో విలువైన కాలాన్ని వృధా చేయవచ్చా? అనే ప్రశ్నను రేకెత్తిస్తుంది.

2001 సెప్టెంబరు 11న న్యూయార్క్, వాషింగ్టన్ నగరాల్లోని భవంతులపై ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో దాదాపు 5వేల మందికి పైగా మరణించారు. ఈ ఘటనను చిత్రం చూపదు. కాని ఆ సమయంలో ఓ కుగ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో బుష్ గడుపుతున్న తీరును, ఆయన ప్రతిస్పందనను చూపుతుంది.

అసలు దాడికి కారణం ఏమిటి? ఆల్‌ఖైదా ఉగ్రవాద సంస్థ, దాని అధినేత ఒసామాబిన్ లాడెన్. వారి రాజకీయ లక్ష్యం ఏమిటి? అల్‌ఖైదా ఉగ్రవాదుల ప్రణాళిక ఎలా నడిచింది! వారి మనస్తత్వాలు ఏ విధంగా ఉండేవి? అసలు బిన్‌లాడెన్ కుటుంబానికి, బుష్ కుటుంబానికి గల ఆర్థిక లావాదేవీలు ఎలా పెరిగి పెంపొందాయి. బేదాభిప్రాయాలు ఎలా తలెత్తాయి? వీటితోపాటు ఇప్పటి బుష్‌కు బిన్‌లాడెన్ కుటుంబ సభ్యులతో కల చెలిమి- ఈ విషయాలన్నింటిని చిత్రం బహుముఖ కోణాల్లో విశ్లేషిస్తుంది.

సెప్టెంబరు 11 ఘటన తరువాత ఆఫ్ఘనిస్తాన్ పై సైనికదాడి జరుగుతోంది. అక్కడితో ఆగక బుష్ ఇరాక్‌లో సద్దాంహుస్సేన్ రసాయనిక ఆయుధాలు తయారు చేస్తున్నాడనే నెపంతోపాటు ఆల్‌ఖైదా ఉగ్రవాదులకు, బిన్‌లాడెన్‌కు స్థావరం కల్పిస్తున్నాడనే ఆరోపణతో ఇరాక్‌పై సైనిక దాడి ప్రారంభిస్తాడు.

ఇక్కడ యుద్ధం వల్ల యుద్ధ పరికరాల ఉత్పత్తి చేసే సంస్థల లాభాలు, ఆయిల్ సంస్థల లాభాలు, వాటి ప్రయోజనాలకై ప్రాకులాడే సెనేట్ సభ్యుల వాదనలను వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో యుద్ధ బాధితుల ఆక్రందనలు ప్రేక్షకుల గుండెల్ని తాకుతాయి. "ఏనాటికైనా భగవంతుడు తమల్ని కాపాడుతాడు. ఆ దుర్మార్గుల పని పడతాడు" అనే తల్లుల శాపనార్థాలు మిన్నంటుతాయి.

కాగా ఇరాక్‌పై యుద్ధం చేయడాన్ని గాఢమైన అమెరికా దేశ భక్తులు కూడా ద్వేషిస్తుంటారు. మరి అమెరికా సైన్యంలో ఎవరు చేరుతున్నారు? అని చూస్తే ఉపాధి కోసం అర్రులు చాస్తున్న నిరుపేద యువత అందునా ముఖ్యంగా నల్లజాతి నీగ్రో యువత ఎక్కువగా ఉంటుంది. అమెరికా నిరుద్యోగ పెనుభూతం యువతను సైనికులుగా మార్చుతున్న వైనాన్ని గణాంక సమాచారంతో సహా చిత్రం విశదపరుస్తుంది. బ్రతుకు తెరువు కోసమే తాము సైన్యంలో చేరామనే వాస్తవాన్ని క్షతగాత్రులైన సైనికులు చెప్తారు. దాదాపు ఈ ఇరాక్ యుద్ధంలో వేయి మందికి పైగా అమెరికా సైనికులు చనిపోయారు. వారి సమాధుల వద్ద బాధితులు విలపించే తీరు వర్ణనాతీతం. ఇదో నిత్యకృత్యం.

'యుద్ధాన్ని ఆపండి, మనుషులుగా మిగలండి' అనే నినాదంతో అమెరికా రోడ్లు అన్ని జనసంద్రం అవుతాయి.

"ఇరాక్‌పై యుద్ధానికిమీరుగాని, మీ అబ్బాయినిగాని సైనికునిగా పంపడానికి సిద్ధపడ్తారా? సిద్ధపడితే సంతకం చేయండి" అంటూ చిత్రం చివరిలో మైఖెల్‌మూర్ అమెరికా సెనేట్ సభ్యుల వెంటపడ్తాడు. కాని వారు తెల్ల ముఖంతో కుతర్క వాదనలు వినిపిస్తారు. కొందరైతే తప్పించుకు పారిపోతారు.

ఎవరి ప్రయోజనాల కోసం ఈ యుద్ధం జరుగుతున్నది? ఎవరు ఈ యుద్ధానికి బలైపోతున్నారు?

అనే మౌలిక ప్రశ్నలకు ఈ చిత్రం సమాధాన మివ్వడమే కాకుండా యుద్ధ వ్యతిరేక శాంతికాముక ప్రజానీకం నానాటికి రోడ్ల మీదకు వచ్చి తమ ఆకాంక్షను బలంగా వ్యక్తపరుస్తున్న తీరును విశదపరుస్తుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే బుష్ యుద్ధోన్మాద సామ్రాజ్యవాద వైఖరిని ఈ చిత్రం నగ్నంగా చూపెడ్తుంది.

అందుకే ఈ చిత్రాన్ని ప్రదర్శించకుండా బుష్ ఎన్నికల ముందు తీవ్ర ప్రయత్నం చేశాడు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా సామ్రాజ్యవాద దేశాలు కూడా బుష్ బాటనే నడిచాయి. కాని మైఖల్‌మూర్ పెద్దఎత్తున న్యాయపోరాటం చేశాడు. ప్రజాస్వామ్య ఉద్యమం ఆయన తరపున నిలిచింది. చివరకు తీవ్రమైన సెన్సార్ కత్తెరలతో చిత్రం దేశదేశాల్లో విడుదలైంది.

ఇందులో ప్రత్యేకమైన నటీనటులు లేరు. 2001 సెప్టెంబర్ 11 దాడి ముందు, వెనుక గల వివిధ టి.వి. ఛానల్స్, పుటేజ్‌ను ఉపయోగించి, వివిధ తరగతుల ప్రజల, మేధావుల ఇంటర్వ్యూలను తీసుకుని తనదైన వ్యాఖ్యాన శైలితో మైఖెల్‌మూర్ ఈ డాక్యుమెంటరీ చిత్రాన్ని రూపొందించారు. యుద్ధాన్ని నిలువరించే శ్రామికవర్గానికి నిజంగా ఇదో గొప్ప కానుక.

■ శైలి

స్ఫూర్తిదాయకం ఈ గూడ్స్‌షెడ్ వర్కర్స్ యూనియన్



ప్రసంగిస్తున్న యూనియన్ అధ్యక్షులు పి.నారయ్య

కృషి,పట్టుదల వుంటే సాధించలేనిది ఏముంటుంది? "అవును సాధించగలం" అని ఋజువు చేశారు నెల్లూరు జిల్లా, పడుగుపాడు రైల్వే షెడ్‌లోడింగ్ & అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్. ఇది సి.ఐ.టి.యు.కు అనుబంధ కార్మిక సంఘం. సుమారు 150 మందిగా వున్న ఆ సంఘం కార్మికులు, తమ పని ప్రదేశం రైల్వే గూడ్స్ షెడ్‌లకు ఎదురుగానే తమ ఆఫీసు నిర్మాణానికి జాతీయ రహదారి పక్కన 15 సెంట్లు స్థలం కొన్నారు. తమ ఆదాయంలో కొంత భాగాన్ని ప్రతి ఒక్కరు విధిగా సంఘానికి జమ చేయాలని తీర్మానించు కున్నారు. పని తక్కువగా వున్న రోజులలో సైతం చాలిచాలని కూలి డబ్బులతోనే, యూనియన్ వాటా తీసి ప్రక్కనపెట్టి మిగిలినవి వంచుకుంటూ అలా రూపాయి రూపాయి కూడబెట్టుకున్నారు.

ఏనాటికైనా నెల్లూరు వాసి, దక్షిణ భారత దేశంలోనే కమ్యూనిష్టు ఉద్యమ నిర్మాత, కార్మిక వర్గ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో స్మారక భవనాన్ని నిర్మించాలని తీర్మానించుకున్నారు. ఆ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించారు.

ఈ యూనియన్ 1980లో స్థాపించారు. యూనియన్ ప్రారంభించినప్పుడు కొన్ని ఇబ్బందులు వచ్చాయి. కాని ఈ యునియన్‌కు మద్దతు ఇచ్చి నిలబెట్టటలో అమరజీవి వి.మాలకొండారెడ్డి నాయకత్వంలో సి.ఐ.టి.యు చాలా కృషి చేసింది.

యూనియన్ సభ్యులు కష్టపడి పనిచేసి వ్యాపారులు, రైల్వే, ఎఫ్.సి.ఐ కాంట్రాక్టర్ల వద్ద మంచి పేరు తెచ్చుకొన్నారు. అనేక నిబంధనలు ఏర్పరచుకొన్నారు. ఎవరు తాగరాదని, పని చేసేటప్పుడు వాదులాడుకోరాదని, సి.ఐ.టి.యు ఇచ్చిన పిలుపులలో పాల్గొనాలని ఇట్లా అనేక నిబంధనలు ఏర్పాటు చేసుకొని చాలా వరకు అమలు చేశారు. చాలా క్రమశిక్షణ గల యూనియన్‌గా గుర్తింపు పొందినది. ఈ యూనియన్ ప్రతినెలా కార్మికుల వద్ద సభ్యత్వం వసూలు చేస్తారు. దానిని యూనియన్ పేరుతో బ్యాంకులో వేస్తారు. కమిటి తీర్మానము ప్రకారము ఖర్చుపెడతారు. ప్రతి సంవత్సరం ఆడిట్ చేయిస్తారు. యాన్యువల్ రిటర్న్ పంపుతారు. యూనియన్ సభ్యులందరూ చాలా కాలంగా కార్మికలోకం చందాదారులుగా ఉన్నారు. చదువు రాకున్నా ప్రతి సభ్యుడు విధిగా కార్మికలోకం పత్రిక కొని చదివించుకుంటాడు.

కార్మికుల విశ్రాంతికి, వాహనాలకు, స్నానాదికాలకూ ఒక షెడ్ గతంలోనే నిర్మించుకున్నారు. 2 అంతస్థుల సువిశాలమైన, సుందరమైన భవనాన్ని నిర్మించారు. తమ ప్రియతమ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య భవనంగా పేరు పెట్టారు. ఈ భవన నిర్మాణములో వాళ్ళు పొదుపు చేసిన డబ్బే కాకుండా యూనియన్ కార్మికులు లక్షలవిలువైన శ్రమ దానం చేశారు. ఆ యూనియన్‌కు అధ్యక్షుడిగా ఉంటూ కార్మికుల్ని క్రమశిక్షణగా నడిపి, అటు ఉద్యమాలలోనూ, ఇటు ఆర్థికంగా సంఘాన్ని పటిష్టంగా నడిపిన కా॥ పి.నారయ్య గారిని ప్రత్యేకంగా అభినందించాల్సి వుంది. స్థానికంగా వున్న ఒక సంఘం ఇంత ఘనకార్యాన్ని సాధించటం మిగిలిన సంఘాలకు, రాష్ట్ర సంఘాలకు స్ఫూర్తిదాయకం.

సుందరయ్య భవనాన్ని నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డా॥ జెట్టిశేషారెడ్డి ఫిబ్రవరి 17న ప్రారంభించారు. కార్మికుల శ్రమ ఫలితంతో నిర్మించిన సుందరయ్య భవనం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నరసింగరావు అన్నారు.

అనంతరం జరిగిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జక్కా వెంకయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ కార్మికుల ఐక్యతకు, పట్టుదలకు ఈ భవన నిర్మాణమే నిదర్శనమన్నారు. 150 మంది కార్మికులు 25 ఏళ్ల నుండి పైసాకు పైసా కూడపెట్టి భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు.

డాక్టర్ బెట్టి శేషారెడ్డి మాట్లాడుతూ అందరికీ ఆదర్శమైన వ్యక్తి పుచ్చలపల్లి సందరయ్య పేర నిర్మాణమైన భవనంలో 150 మంది రైల్వే గూడ్స్ షెడ్ లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ ముఠావర్కర్స్ యూనియన్ కార్మికుల శ్రమ దాగి ఉన్నదన్నారు. పట్టుదలతో లక్ష్యాన్ని సాధించిన ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.నారయ్యను అభినందించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నారుకృష్ణయ్య, సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి మోహన్‌రావు, నగర అధ్యక్షులు డి.రామసుబ్బారెడ్డి, ఎస్.మురళీకృష్ణ, ఎన్.రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిట్టేటి రమణారెడ్డి, రైల్వే గూడ్స్ షెడ్ యూనియన్ అధ్యక్షులు నారయ్య, యూనియన్ గౌరవాధ్యక్షులు రామరాజు మాట్లాడారు.

■ ఎస్.మురళీకృష్ణ

వేతన సవరణకై మార్చిలో భీమా ఉద్యోగుల సమ్మె

ఎఐఐఇఎ 20వ జాతీయ మహాసభల పిలుపు

ఎన్.ఎం.సుందరం

ఇన్సూరెన్స్ రంగంలో బలమైన సంఘంమైన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ఎంప్లాయీస్ అసోసియేషన్ 20వ జాతీయ మహాసభలు ఫిబ్రవరి 19-24 తేదీలలో బెంగుళూరులో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఎన్.ఎం.సుందరంగారు ఈ సభలకు అధ్యక్షత వహించారు. పార్లమెంటు సభ్యులు రూప్‌చంద్‌పాల్ సభలను ప్రారంభించారు. మాజీ ప్లానింగ్ కమిటీ సభ్యులు డా॥ఎల్.సి.జైన్ ముఖ్యఅతిధిగా సభలలో పాల్గొన్నారు. దేశం నలుమూలల నుండి 2వేల మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారు.

ఈ మహానభల్లో అధ్యక్షులుగా ఎన్.ఎం.సుందరం, ప్రధాన కార్యదర్శిగా కె.వేణుగోపాల్, మరియు 162 మందితో నూతన వర్కింగ్ కమిటీ ఎంపికయింది.

సభలో క్రింది తీర్మానాలు ఆమోదించారు

1. వేతనాలు పెంచాలని కోరుతూ మార్చి 23, 24 తేదీల్లో జిఐసిలో సమ్మె చేయాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) నిర్ణయించింది. ఈ సమ్మెలో జిఐసి, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, న్యూ ఇండియా ఎష్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ సిబ్బంది పాల్గొంటారు. అదే రోజున ఎల్ఐసి సిబ్బంది సంఘీం భావంగా ప్రదర్శనలు నిర్వహిస్తారు. మార్చి 31న ఎల్ఐసిలో వేతనాలను పెంచాలని కోరుతూ సమ్మె చేస్తారు.

కె.వేణుగోపాల్

2. భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 26శాతం నుంచి 49శాతానికి పెంచటానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తే దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేయాలని నిర్ణయించారు.

3. ఎఫ్‌డిఐని అనుమతించాలని ప్రభుత్వ ప్రయత్నాలను నిరసిస్తూ ఇప్పటికే 261 మంది పార్లమెంటు సభ్యులను కలసి వారి మద్ధతును తీసుకోవడం జరిగింది.

4. కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వం జాతీయ కనీస ఉమ్మడి ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు నాలుగు ప్రభుత్వరంగ సాధారణ భీమా కంపెనీలయిన నేషనల్, న్యూఇండియా, ఓరియెంటల్ మరియు యునైటెడ్ ఇండియాలను విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ■

వార్తా పత్రికల రిజిస్ట్రేషన్
(రూలు 8వ ఫారం IV ప్రకారం)
కార్మికలోకం పత్రిక ప్రచురణ వివరాలు

ప్రచురణ స్థలం	:	హైదరాబాద్
పత్రిక ప్రచురణ కాలం	:	మాసపత్రిక
ముద్రాపకుని పేరు	:	ఎం.ఎ.గఫూర్
జాతీయత	:	భారతీయుడు
చిరునామా	:	1-1-60/4, ఎన్.వి. భాస్కరరావు స్మారక కేంద్రం, ముషీరాబాద్, హైదరాబాద్ - 20
ప్రచురణకర్త పేరు	:	ఎం.ఎ.గఫూర్
జాతీయత	:	భారతీయుడు
చిరునామా	:	1-1-60/4, ఎన్.వి. భాస్కరరావు స్మారక కేంద్రం, ముషీరాబాద్, హైదరాబాద్ - 20
సంపాదకుని పేరు	:	వై.సిద్ధయ్య
యాజమాన్య వివరాలు	:	పత్రిక ఆస్తులన్నీ సి.ఐ.టి.యు. ఆంధ్రప్రదేశ్ కమిటీకి చెందినవి.

ఎం.ఎ.గఫూర్ అను నేను పైన ప్రకటించిన వివరములన్నీ యదార్థమని పేర్కొనుచున్నాను.

ఎం.ఎ.గఫూర్
ప్రచురణకర్త

Printed & Published by Sri.M.A.Gafoor On behalf of CITU A.P. State Committe from N.V.B Smaraka Kendram, 1-1-1-60/4, Musheerabad, Hyderabad - 20, Type setting & Printing at Prajasakti Daily Printing Press, RTC'X' Roads, Hyderabad - 20. Editor Y. Siddaiah.

అగ్రగామి ఆంధ్రప్రదేశ్



- ఊరూరా, వాడవాడల పర్యటిస్తూ, ప్రజలను పలకరిస్తూ సమస్యలను పరిష్కరించే ప్రయత్నమే 'రాజీవ్ పల్లెబాట'
- ప్రతిగ్రామాన్ని ఇంటర్‌నెట్ ద్వారా అనుసంధానం చేసి వారికి ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందించడం కోసం 'రాజీవ్ ఇంటర్నెట్ విలేజ్'
- నిరుద్యోగ యువత కోసం ఉపాధి లక్ష్యంగా 'రాజీవ్ యువశక్తి'
- రూ. 500 కోట్లతో ఎస్.సి., ఎస్.టి., బలహీన వర్గాల సమగ్రభూమి అభివృద్ధి ప్రాజెక్టు 'ఇందిర ప్రభ'
- రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, నీటిపారుదల, ఇతర అనుబంధ రంగాలకు మూడవ వంతు నిధులు
- పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట, విశాఖ సమీపంలో 2120 ఎకరాలలో రూ. 182 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకోనున్న 'మెగా ఫార్మాసిటీ'
- వచ్చే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 46 వేల కోట్ల రూపాయల ఖర్చుతో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళికలు

KLV01A374

KARMIKALOKAM MARCH - 2005 RNI.NO.APTEL/1985/13241/H/SD-139/2003-05

పడుగుపాడు రైల్వే గూడ్సు షెడ్ లోడింగ్ & అన్‌లోడింగ్ ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం)

పడుగుపాడు, కోవూరు మండలం, నెల్లూరు జిల్లా.

వారిచే నిర్మించబడిన

పుచ్చలపల్లి సుందరయ్య భవనము

ప్రారంభోత్సవంకు హాజరైన ప్రముఖులు

ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న యూనియన్ అధ్యక్షులు పి.నారయ్య

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVOLA 374
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25-8-2023
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Mounika
పేజీలు విడదీసినది	Mounika
స్కాన్ చేసినది	Mounika
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యబడి	
తప్పులు	NO
పరిస్థితి	good